

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

అనంతపురం : fb.com/vaartha

PUBLISHED FROM ANANTAPUR, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

26-8-2023 శనివారం సంపుటి : 29 సంచిక : 207, పేజీలు : 08+4 వెల : 6.50


భారత్, గ్రీస్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు లక్ష్యం: ప్రధాని మోడీ 2లో

దేశంలోనే తొలిసారి పిల్లలకు అల్పాహార పథకం 5లో

## గిరిపుత్రుల జీవితాల్లో ఇక కొత్త కాంతి

### రూ.834 కోట్ల వ్యయంతో గిరిజన వర్సిటీకి శంకుస్థాపన చేసిన సిఎం జగన్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**విజయనగరం, ఆగస్టు 25, ప్రభాతవార్త:** గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేలా గిరిజన విశ్వవిద్యాలయం రూపు దిద్దుకుంటుందని ఎపి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాల్లోని మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద 561.88 ఎకరాల విస్తీర్ణంలో 834 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేయనున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులకు ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దత్తిరాజేరు మండలం మరడాంలో జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ గిరిజనుల కుటుంబాల్లో ఉన్నత విద్యాకాంతులు విరజిల్లేందుకు ఈ గిరిజన యూనివర్సిటీ దోహదపడుతుందన్నారు. గిరిజనులు సామాజికంగా ఇప్పటికీ వెనుకబడే ఉన్నారని పేర్కొంటూ వారి జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలని ఆకాంక్షించారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ పరంగా గిరిపుత్రులకు వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ట్రైబల్‌అడ్వైజర్ కమిటీని నియమించానని, ఇద్దరు గిరిజనులను డిప్యూటీ సీఎంలుగా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కు ≫2



శుక్రవారం చినమేడపల్లి వద్ద గిరిజన వర్సిటీకి శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సిఎం జగన్ తదితరులు

## వీఆర్‌ఏల భారీ ఆందోళన

### నాయకుల అరెస్టు, విడుదల

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** వేతనం పెంచాలంటూ వీఆర్‌ఏలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తమకు నెలకు కనీస వేతనంగా 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. వేతనాల పెంపుపై వీఆర్ ఏల సంఘం ఛలో విజయవాడకు రాష్ట్ర వ్యాప్త పిలుపు నిచ్చారు. అయితే ఈ ఆందోళనకు పోలీసులు అనుమతినివ్వలేదు. అయినప్పటికి ఆందోళన కొనసాగిస్తామని వీఆర్ ఏల నాయకులు ప్రకటించారు. ఈ క్రమంలో పలువురు నాయకులను పోలీసులు ఎక్కడిక్కడి గృహనిర్బంధం చేసారు. తీవ్ర ఆంక్షలు నడుమ విజయవాడ నగర ప్రధాన కూడలికి వివిధ జిల్లాల నుంచి చేరుకున్న వీఆర్‌ఏలు నిరసన ప్రదర్శనకు ≫2

## వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారాలకు దరఖాస్తులు

### 31 దాకా గడువు: సమాచార కమిషనర్ విజయకుమార్ రెడ్డి



**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఆచీవ్‌మెంట్(జీవనసాఫల్య పురస్కారం). వైఎస్సార్ అచీవ్‌మెంట్ 2023 అత్యున్నత పురస్కారాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ మాసాంతానికి ముగుస్తుంది. శుక్రవారం ఈ విషయాన్ని హైపవర్ కమిటీ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, సమాచార పౌర సంబంధాలు శాఖ ≫2

## 24మందితో టిటిడి పాలక మండలి

### బోర్డు సభ్యులలో పొన్నాడ సతీష్‌కుమార్, సామినేని ఉదయభాను, తిప్పేస్వామి, శిద్దా సుధీర్‌కుమార్, మేక శేషుబాబు, గడ్డం సీతారెడ్డి ప్రభృతులు



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానం పూర్తిస్థాయి ధర్మకర్తలమండలి సభ్యుల్ని ఖరారు చేస్తూ ప్రభుత్వం శుక్రవారంరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 24మంది సభ్యులతో తాజాగా ధర్మకర్తలమండలిని ఏర్పాటు చేసింది. 2024లో ఎన్నికలు జరగనున్న తరుణంలో పార్టీలో పనిచేసిన వారికి, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపిలకు టిటిడి బోర్డులో ఈ సారి అవకాశం లభిస్తుందని భావించారు. అయితే ఎన్నికల ముందు నియామకమైన ప్రాధాన్యత ఉన్న బోర్డులో కూడా మన రాష్ట్రానికి చెందిన వారితో బాటు తమిళనాడు, మహారాష్ట్ర,కర్ణాటక నుంచి పలువురికి ప్రాతినిథ్యం కల్పించారు. వీరిలో డాక్టర్ కేతన్‌దేశాయి గతంలోనూ గుజరాత్ నుంచి టిటిడిబోర్డులోసభ్యుడుగా పనిచేశారు. కాగా రాష్ట్రంలో ముమ్మిడివరం, జగ్గయ్యపేట, మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యేలకు, కడపజిల్లా సిద్దవటంకు చెందిన నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్రచైర్మన్‌గా పని ≫2

## ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసు

### ఓబుళాపురం మైనింగ్ కేసులో పలు అభియోగాలు 2లో



## శేషాచలంలో మరో ఐదు 'చిరుత'లు!

### ఆపరేషన్ చిరుతలో 320కిపైగా ట్రాప్ కెమెరాలు, 36బోన్లు

**తిరుమల, ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతంలో వెలసిన తిరుమలకొండకు కాలినడక మార్గాల్లో మళ్లీ ఐదు చిరుతపులుల కదలికలు ఉన్నట్లు గుర్తించారు. ఈ చిరుతలు సంపర్కంలో భాగంగా అడవిలో ఒకచోట నుంచి మరోచోటుకు సంచరించే సమయంలో భక్తుల సంచారం ఉండే కాలినడకమార్గాల ప్రాంతాలైన గాలిగోపురం, నామాలగవి, లక్ష్మీనరసింహస్వామి ఆలయం,మోకాలిమిట్ట పరిసరాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు టిటిడి అటవీశాఖ ఏర్పాటుచేసిన ట్రాఫ్ సిసి కెమెరాల్లో రికార్డయ్యింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో మూడు చిరుతలను బంధించిన అధికారులు రెండింటిని మ్యాన్‌ఈటర్‌గా తిరుపతి ఎస్వీజూపార్కుకు తరలించిన విషయం విదితమే. ఇప్పటికే తిరుపతి అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గాల్లో కాలినడక భక్తులకు పూర్తి భద్రత కల్పిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం, అటవీశాఖ, పోలీసుశాఖలు తాజాగా ట్రాఫ్ కెమెరాల ఆధారంగా మరో ఐదు చిరుతలు ఉన్నట్లు గుర్తించారు. గత కొన్నేళ్ళక్రిందట వరకు తిరుమలలోని అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న ఘాట్‌రోడ్లు, పాపవినాశనం, గోగర్భమ్‌జలాశయం,కుమారధార తీర్థాల పరిసరాల్లోని అతిథి గృహాల వద్ద మాత్రమే కనిపించే ఈ చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు, హైనాలు, దుప్పులు జనసంచారం ఉన్న ప్రాంతాల్లో సంచరిస్తుండటం భక్తులను భయాందోళనకు గురిచేస్తోంది. గత జూన్‌నెలలో కర్నూలు జిల్లాకు చెందిన నాలుగేళ్ళ బాబు కౌశిక్‌పై కాలినడక మార్గంలో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన చిరుత అదృష్టంతో బాలుడ్ని వదలిపెట్టింది. ఈనెల 11న ఇదే కాలినడక మార్గంలో నెల్లూరుజిల్లా పోతిరెడ్డిపాళెంకు చెందిన ఐదేళ్ళచిన్నారి లక్షితపై రాత్రివేళ దాడిచేసి తీవ్రంగా గొంతు కొరికి తలభాగాన్ని తిని దారుణంగా చంపేసిన ఘటన జరిగింది. ఈ విషాద సంఘటనలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాలినడకన తిరుమలకు వచ్చే భక్తుల్లో భయాందోళన తొలగించేందుకు 320కిపైగా ట్రాఫ్ సిసికెమెరాలు అటవీప్రాంతంలో, చిరుతలను, ఎలుగుబంటిని బంధించడానికి 32వరకు బోన్లు ఏర్పాటుచేసి 24గంటలూ ఆపరేషన్ చిరుత కొనసాగిస్తున్నారు. అంతేగాక మధ్యాహ్నం 2గంటల తరువాత కాలినడక మార్గంలో 12ఏళ్ళలోపు పిల్లలను, వారి తల్లిదండ్రులను అనుమతించడంలేదు. ఘాట్‌రోడ్లలో ఏకంగా సాయంత్రం 6గంటల తరువాత ఉదయం 6గంటల వరకు ద్విచక్రవాహనాలను నిషేధించారు. తిరుమల కాలినడక మార్గాలు, ఘాట్‌రోడ్లలో పరిస్థితిని ఎప్పటికప్పుడు టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, అటవీశాఖ సిసిఎఫ్ నాగేశ్వరరావు, టిటిడి అటవీశాఖ డిఎఫ్ఓ శ్రీనివాసులు, అటవీశాఖ డిఎఫ్ఒ సతీష్‌రెడ్డి సమీక్షిస్తూ భక్తుల భద్రతకు చర్యలు తీసుకున్నారు. గాలిగోపురం వద్ద నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు కాలినడకన వందమంది భక్తులను గుంపుగా అనుమతినిస్తూ వారికి ముందూ వెనుకా భద్రత సిబ్బందిని పూర్తిస్థాయిలో రక్షణగా పంపుతున్నారు. శేషాచలంలో కాలినడక మార్గాల్లో ఆపరేషన్ చిరుత కొనసాగుతోందని, ఎలుగుబంటిని కూడా పట్టుకుని బంధిస్తామని ఇప్పటికే టిటిడి ఇఒ ధర్మారెడ్డి ప్రకటించిన విషయంవిదితమే. తాజాగా ఐదు వరకు చిరుతలు సంచరిస్తున్నట్లు ట్రాఫ్ కెమెరాల్లో గుర్తించడంతో మరింత అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.




26-8Pg4 :Layout 1 01/01/01 5:34 AM Page 1



వార్త

ఎలా పొందాలో తెలుసుకుంటే,
అనంతమైన శక్తి మనిషికి
అందుబాటులో ఉంది.

-ఆడమ్స్ బెక్

# విస్తరిస్తున్న ఆర్థిక నేరాలు!

దొంగతనంబు రతనంబు నందు, దొంగతనంబు నందు భాగ్యవంతునికి ఏదైనా బాధ లేదు అన్నారు పెద్దలు. ఏ సందర్భంలో, ఏ అనుభవంతో, ఎవరిని ఉద్దేశించి ఈ లోకోక్తి పుట్టిందో కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే వారు చెప్పింది నిజమేమోనని అనిపిస్తుంది. మన రాజ్యాంగ నిర్మాతలు ఇవేమీ దృష్టిలో పెట్టుకోకుండా కుల,మత, వర్గ బేధాలు లేకుండా అందరికి సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో లేదా దక్షిణలకు ప్రలోభపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మల్చుకుంటారని నాటి రాజ్యాంగనిర్మాతలు ఊహించలేకపోయారేమో. ఫలితంగా వందలాది కరుడు గట్టిన నేరస్తులు ప్రజలను దగా చేసి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వైట్‌కాలర్ నేరస్తులు తప్పించుకోగలుగుతున్నారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పటిష్టంగా రికార్డులు తయారు చేసి, అవసరమైన సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచి నేరాన్ని రుజువు చేయడంలో విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా ముందుకు నడవకపోతే మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయే విధంగా రికార్డులు తయారు చేస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో అధికారులు సకల అవస్థలుపడి కోర్టుల ముందు రుజువుకు సర్వం సిద్ధం చేసినప్పుడు పాలకపెద్దలే కొందరు ఏకంగా ఒక్క కలం పోటుతో కేసును ఉపసంహరిస్తున్నారు. అలాంటి ప్రభుత్వ చర్య సమర్థవంతంగా దర్యాప్తు చేసే అధికారుల్లో నిరాశా నిస్పృహలను పెంచుతుంది. దీనికితోడు ఆనాటి పరిస్థితు లకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలానుగుణంగా సవరించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. ఇప్పుడుతాజాగా కేంద్రప్రభుత్వం ఐపిసి, సిఆర్‌పిసిలో సమగ్ర మార్పులు, సవరణలకు నడుం కట్టింది. ఈ మేరకు పార్లమెంటులో చర్చకు ప్రవేశపెట్టేందుకు సంసిద్ధమైంది. చర్చోపచర్చలు జరిగిన తర్వాత అన్ని కోణాల్లో పరిశీలించిన పిదప వచ్చే సమావేశాల్లో మార్పులకు నాంది పలకవచ్చునని ఊహిస్తున్నారు. కానీ ఉన్న నిబంధనలను చట్టాలనుఏమేరకు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నారన్నదే ప్రశ్న. ధనిక,పేద తేడాలు లేకుండా ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారన్నదే ముఖ్యం. ఏ అండలేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తున్నారో ప్రత్యేకంగా చర్చించాల్సిన పనిలేదు. ఇక దేశవ్యాప్తంగా అనేక బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి లక్షలాది మంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవితకాలంపాటు సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదన అరణ్యరోదనగా మారి కొందరు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే గత పదేళ్లలో కనీసం పదివేనువేల కోట్లకుపైగా ఫైనాన్స్ కంపెనీలు, చిన్నచిన్న చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అనధికార లెక్కలు చెబుతూనే ఉన్నాయి. ఇరవైఐదు లక్షల రూపాయలు మొదలుకొని రెండువందల యాభైకోట్లవరకు మోసం చేసిన ఫైనాన్స్‌కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారు. ఇవేకాదు రకరకాల మోసాలు పెరిగిపోతున్నాయి. ఒకే ప్లాట్‌ను ఇద్దరి, ముగ్గురికి అమ్ముతూ కొన్నిసార్లు అయితే లేని ప్లాట్లను విక్రయించడం ఇలా ఇళ్లస్థలాల అమ్మకాల్లో ఘరానా మోసం చేసిన పెద్దలెందరో నిర్భయంగా తిరుగుతున్నారు. ఇక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటూ దగా చేస్తున్న దళారుల సంఖ్య అంతకంతకు పెరిగిపోతున్నది. ఏదోరకంగా డబ్బు సంపాదించగలిగితే తమను ఎవరూ ఏమీ చేయలేరనే భావన రోజురోజుకు విస్తరిస్తున్నది. అందుకే ఒకరిని చూసి ఒకరు పోటీపడి ప్రజలను మోసం చేసి కోటీశ్వర్లు అయిపోతున్నారు. ఈ విషయాల్లో బాధితులు కొందరు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలావున్నా అసలు కేసు నమోదు చేసుకోవడానికి కూడా కొందరు అధికారులు ఇష్టపడడం లేదు. మమ్మల్ని అడిగి ఇచ్చావా?లాభం వస్తే మావద్దకు వచ్చేవాడివా? అంటూ రకరకాల ప్రశ్నలవర్షం కురిపించి బాధితులు మళ్లీస్టేషన్‌కు రాకుండా చేసిపంపుతున్నారు. అంతేకాదు ఇది పూర్తిగా సివిల్ తగాదా అని జోక్యంచేసుకోవడానికి వీల్లేదని, కోర్టుకువెళ్లి కేసుపెట్టి వసూలు చేసుకోమని సలహాలు ఇస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో రాజకీయ ఒత్తిడో లేక మరే రకమైన కారణా లతో కేసు నమోదు చేసి చర్యలు చేపడుతున్నారు. అయితే ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పనిచేయలేరనే వాదన కూడా తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసులకు కూడా బాధ్యతలు పెరిగిపోయా యనడంలో సందేహం లేదు. ముఖ్యంగా విఐపి బందో బస్తులోనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తున్నది. ఆయా ప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా, అరాచకశక్తులు విజృంభించడంతో శాంతిభద్రతలు క్షీణించినా పర్వాలేదు కానీ విఐపి పర్యటనలో ఏమాత్రం పొరపాటు జరిగినా తమ ఉద్యోగానికి ముప్పుతప్పదన్న భావనతోనే ప్రజా సమస్యలను విస్మరించి నేతలసేవవైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే సాధ్యమైనంతవరకు ఇలాంటి ఫిర్యాదు లన్నింటిని నమోదు చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఫలితంగా నేరాలు పెరిగిపోతున్నాయి. అమాయకులు అన్నివిధాలుగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకొని ఈ మోసాలకు అడ్డుకట్టవేసేందుకు అవసరమైనా చర్యలు తీసుకోవాలి.

మనుషులకు వారి అవసరాలు గుర్తుంటాయేకాని, సామర్థ్యాలు గుర్తుండవు.



నెపోలియన్

ప్రతి మనిషీ కావలసినవాడే. కాకపోతే ఏ మనిషీ ఎక్కువగా కావలసినవాడు కాదు.



ఎమర్సన్

## ప్రజావాక్కు

### ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులేవి?

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే అసలైన ఉపాధ్యాయు లకు బదులు నకిలీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని విద్యాశాఖాధికారులు చెప్పిన విషయం ఇంకా వాస్తవ రూపం దాల్చటం లేదు. రెండేళ్ల క్రితమే ఉపాధ్యాయుల ఫొటో, ఇతర వివరాలు అన్నీ సేకరించి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసుకున్నారు. ఐడెంటిటీ కార్డులతయారీకి ఒప్పందం కుదుర్చుకుని ఒక ప్రైవేట్ సంస్థకు అప్పచెప్పమంటున్నారు.కాని విద్యాశాఖాధికారుల మాటలు నమ్మకం కలిగించేవిగా లేవు. ఇకనైనా రాష్ట్రంలోని నకిలీ ఉపాధ్యాయులను ఏరివేసే కార్యక్రమంలో భాగంగా అసలైన ఉపాధ్యాయులకుగుర్తింపు కార్డులువెంటనే జారీచేయాలి.

-జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

### సబ్సిడీ తగ్గింపు

పోషక విలువలు గల ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని తగ్గించాలని కేంద్రం నిర్ణయించడం రైతుల పాలిట అశనిపాతం. రుతుపవనాల రాక ఆలస్యమవుతుందన్న వార్తలు రైతుల్లో గుబులు పుట్టిస్తున్న తరుణంలో ఇటువంటి నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వ నిర్ణయం వలన ఎరువుల ధరలు పెరుగుతాయి. రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల విపరీతంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు వలన రైతులకు పెట్టుబడి వ్యయం కూడా లభించడం లేదు. ఎరువుల వాడకం అధికం కావడం వల్ల రైతుల పెట్టుబడి వ్యయం బాగా పెరిగిపోయింది. నీటి సౌకర్యాలు పెరిగినా ఆ మేరకు ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యయం తడిసి మోపెడు కావడం వల్ల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుకావడం లేదు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### గుత్తేదారునిదే బాధ్యత?

పోలవరం ప్రాజెక్టునిర్మాణంలో జరిగినలోపాలకు, జాప్యానికి గుత్తేదారుడే బాధ్యుడు! రాష్ట్రానిదే బాధ్యత అని కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో రివర్స్ టెండర్ ద్వారా నిర్మాణ బాధ్యతలు తీసుకున్న గుత్తేదారు జరిగిన జాప్యానికి, నాణ్యతా ప్రమాణాలు పాటించనందువలన జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత గుత్తేదారునిదే. రాష్ట్ర పాలకులు ఈ విషయంలో రాజీ పడకూడదు. పాలకుల తప్పుడు నిర్ణయాలకు, ప్రజలపై భారం పడకూడదు.

-జి. రామకృష్ణ, నల్గొండ జిల్లా

### విద్యాసంస్థల్లో కుల వివక్ష?

రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో కుల వివక్షత రోజురోజుకు ఎక్కువ అవుతుంది. గత కొన్నిసంవత్సరాల క్రితం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాలంలో జరిగినట్లుగా దళిత విద్యార్థులను క్లాస్‌రూమ్‌లలో వారు ప్రయాణించే స్కూల్ బస్సులలో నిలబెట్టి ప్రయాణించడం అది ఏమిటని ప్రశ్నిస్తే దళిత విద్యార్థులనుస్కూల్ బస్సు ఎక్కనీయకపోవడం జరుగుతుంది. పాఠశాలలో మంచినీళ్లు ఇవ్వడం లేదు. హామీ పత్రం ఇచ్చే విధంగా తెలంగాణ రాష్ట్రవిద్యాశాఖ కృషిచేయాలి. కుల వివక్షత చూపిన యజమానికి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టంకింద కేసు నమోదు చేయాలని ఎస్సీ,ఎస్టీ పేరెంట్స్ విద్యాశాఖకువిపన్నం చేస్తున్నది.

-రాపాక వీరందర్, జనగాం

### ధరలను అదుపులో ఉంచాలి

దేశంలో ఆర్థికపరిస్థితి బాగుపడాలంటే రూపాయి విలువ సరైన స్థితిలో నిలబడాలి. అలా జరగాలంటే ఆహారధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా జరిగి, స్థిరమైన తక్కువ ధరలలో ఉంచాలి. ధర తక్కువైనప్పటికీ రూపాయి విలువ నిలకడగా ఉంటే, ప్రజల ఆర్థిక వ్యవస్థగాని, ప్రభుత్వ ఆర్థిక స్థితిగాని దెబ్బతినదు. అలా కాకుండా నిత్యావసర వస్తువులధరలు రోజురోజుకీ పెరిగిపోతుంటే రైతులకు గాని,వ్యాపారస్తులకు గాని, ఉద్యోగులకు కాని ఎంత రాబడి ఉన్నా, సుఖజీవితం ఉండదు. అంచేత ధరలను అదుపులో పెట్టడం చాలా అవసరం. అయితే ధరలను అదుపు పెట్టే చర్యలు దేశమంతటా ఒకేలా అమలు జరగాలి. రైతుల పెట్టుబడికీ, కృషికి తగిన ఫలితం చేకూరేలా ప్రభుత్వం ధరలను నిర్ణయించాలి. అప్పుడే నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంటాయి.

-కె.నాగేంద్ర, హైదరాబాద్

### పోలీసు వ్యవస్థ తీరు మారాలి!

గతనాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో పోలీసుల అక్రమాలు, దుర్వినియోగం, మోసాలు, న్యాయస్థానం ఆదేశాలు బేఖాతరు చేయడం పెరిగిపోతున్నాయి. తాజాగా విశాఖలో ఓ పోలీసు అధికారిణి నోట్ల మార్పిడి మోసం కేసుల్లో పట్టుబడడం వాస్తవ పరిస్థితికి అద్దంపడుతున్నది. రాజకీయనాయకుల పైరవీలతో ఈ అక్రమాలకు అంతులేకుండాపోతున్నది. ఏ అధికారి కూడా నిజాయితీగా విధులు నిర్వహించే పరిస్థితి లేదు. గంజాయి అక్రమ రవాణాలో భూ కుంభకోణాల్లో హత్యల్లో అత్యాచారాల్లో పోలీసుల పాత్ర శృతి మించిపోయింది. ఈ దుస్థితికి పాలకులే బాధ్యత వహించాలి.

-కె. కోటేశ్వరరావు, విశాఖపట్నం

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఎన్నాళ్లీ చిలుక జోస్యం?

**అమెరికా లాంటి దేశాలు ఉపయోగిస్తున్న నేషనల్ సెంటర్స్ ఫర్ ప్రిడక్షన్ కొంతమేరకైనా వాస్తవాలకు దగ్గరగా ఉండే సమాచారాన్ని అందిస్తున్నది. త్రిడి మోడల్‌గా ఉన్న ఎన్‌సిఇపి చాలా క్లిష్టమైన వాతావరణం, సముద్రాల్లో వచ్చే మార్పును నిశితంగా పరిశీలించి పసిగట్టగలుగుతుంది. అలాంటి అభివృద్ధిచెందిన సాంకేతిక పరికరాలు, పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని అందిస్తూ ప్రజావిశ్వాసాన్ని పెంచుకుంటూ ఆయా దేశాలు పురోగమిస్తుంటే మనదేశంలో కాలం చెల్లిన పరికరాలతో కాలం గడుపుతున్నారు. ఎవరెన్ని చెప్పినా రైతుల్లో మాత్రం వాతావరణ శాస్త్రజ్ఞుల మాటలపై రానురాను నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి.**

దామెర్ల సాయిబాబ

విశ్వాసం వ్యక్తికి అద్భుతమైన ఉత్తేజాన్ని ఇస్తుంది. కార్యోన్ముఖున్ని చేస్తుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదుర్కొంటాడు. అదే వ్యక్తికి విశ్వాసం సన్నగిల్లితే ఏ చిన్న ఎదురుదెబ్బ తగిలినా తట్టుకోలేడు. తనకుతాను సమిధైపోతాడు. అందుకే విశ్వాసం అన్నది మానవ జీవన పోరాటంలో ఎంతో ముఖ్యమైంది. ఆ విశ్వాసం దెబ్బతినే దేశంలో లక్షలాది మంది రైతులు తమను ఆదుకునేవారు ఎవరూ లేరనే నిరాశానిస్పృహలతో తమలో తాము కృంగికృశించిపోతున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్నో కార్యక్రమాలు చేపట్టినా రైతులు అంతగా విశ్వసించలేకపోతున్నారు. యేదాదియేడాదికి వ్యవసాయరంగం అంతకంతకు నష్టాల ఊబిలో దిగబడిపోతున్నది. ఐదేళ్లలో వ్యవసాయ ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్రపెద్దలు చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. రెట్టింపు సంగతి దేవుడెరుగు పెరిగిన పెట్టుబడులతో నష్టాలు మూడింతలుగా పెరిగిపోయాయి.అసలు వ్యవసాయమే గిట్టుబాటు కాకుండాపోతున్నది. ఇందుకు తోటి మనుషులు చేస్తున్న మాయాజాలం ఒక ఎత్తుఅయితే ప్రకృతి అన్నదాతపై పగబట్టి వ్యవహరిస్తున్నదేమోననిపిస్తున్నది. భారత దేశంలో రైతులు అధికశాతం వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేస్తున్న విషయం తెలియందికాదు. అయితే ఈ వర్షాలు ఎప్పుడు వస్తాయో, ఏ మేరకు ఎక్కడ కురుస్తాయో అంచనాలు వేసి రైతులకు సరైన సమాచారం అందించడంలో అధికారయంత్రాంగం విఫలమవుతున్నది. కోట్లాది రైతుకుటుంబాల జీవనోపాధికి సంబంధించిన సమాచారం అందించాల్సిన వాతావరణ పరిశోధన విభాగం సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నదనే విమర్శలు ఏనాటి నుంచో ఎదుర్కొంటున్నది. అయితే కోట్లాది మంది రైతులను తప్పుతోవ పట్టించడానికే కావాలని తప్పుడు సమాచారం ఇస్తున్నారని చెప్పడం లేదు. కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా రైతులకు మాత్రం సరైన సమాచారం ఇవ్వడంలో విఫలమవుతున్నారనే మాట వాస్తవం. ప్రజల్లో వాతావరణ శాఖ అంచనాల పట్ల రానురాను నమ్మకం సన్నగిల్లుతున్నది. ఎంతో మంది అనుభవజ్ఞులైన నిపుణులు, సాంకేతిక పరిజ్ఞానం ఉందని చెప్పుకుంటూ ఎందుకు సరైన సమాచారం ఇవ్వలేకపోతున్నారనేది సామాన్యులను వేధిస్తున్న ప్రశ్న. రుతుపవనాల గమనం వర్షపాత విషయంలో భారత వాతావరణశాఖ కచ్చితమైన అంచనాలు వేయలేకపోతున్నది. కేంద్ర మంత్రులు కూడా సాక్ష్యాత్తు పార్లమెంటులోనే ఈ విషయాన్ని అంగీకరించారు. వారు చెప్పే మాటలకు వేసే అంచనాలకు, జరుగుతున్న దానికి పొంతనలేకుండాపోతున్నది. ఈ యేడాది తీసుకున్నా తెలుగు రాష్ట్రాల్లో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని సెలవిచ్చారు. కానీ వారి అంచనాలు కొంతవరకు నిజమని భావించినా కురిస్తే కుంభవృష్టి లేకుంటే అనావృష్టిగా అన్నట్లుగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనే కొన్ని ప్రాంతాల్లో రాష్ట్ర చరిత్రలో లేనివిధంగా ఒక్కసారిగా అంచనాలకు మించి కుంభవృష్టి కురవడం, వరదలు పెరగడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అతలాకుతలం అయ్యారు. భారీగా నష్టం జరిగింది. ఆ తర్వాత వాతావరణశాఖ మరో మూడు రోజులు వర్షాలని ఎప్పటికప్పుడు చెబుతున్నా గత రెండుమూడు వారాలుగా వర్షాల జాడ లేకపోయింది. తలతాకట్టుపెట్టి అప్పులు తెచ్చి లక్షలాది ఎకరాల్లో విత్తిన విత్తనాలు మాడుముఖం పట్టాయి. మబ్బులు చూసి ముంతలో నీరు పారబోసుకున్నట్లు అయిందని రైతులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరుణదేవుడికోసం పూజలు, పునస్కారాలు, జపాలు కూడా చేస్తున్నారు. వందలాది కోట్లు వెచ్చించి నిర్వహిస్తున్న వాతావరణ పరిశీలన కేంద్రాలు ఎందుకు సరైన సమాచారాన్ని ఇవ్వలేకపోతున్నాయి? రకరకాల లెక్కలు చెబుతున్నారు. ముప్ఫైఏళ్లను ఒక శకంగా అంచనా కడతారు. 1901 నుంచి తీసుకుంటే 1930 ఒక శకం. 1930 నుంచి 1960 వరకు మరొక శకం. 1960 నుంచి 1990 వరకు మరొక శకం.1990 నుంచి 2020వరకు ఇంకొక శకం. 2020-2050 వరకు మరొక శకంగా అభివర్ణిస్తారు. రెండు శకాల్లో వర్షాలు బాగాపడ్డాయి. మూడో శకంలో తిరిగి వర్షాభావం ఏర్పడిందని, నాలుగో శకంలో వర్షాలు కురిశాయి. ఐదో శకంలో వర్షాభావం ఉండవచ్చునని దీనికి శాస్త్రీయ కారణాలు కూడాఉన్నాయని అంటున్నారు.సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న దశలో వర్షాలుసృష్టించి కురిపించలేకపోతే పోయారు. కానీ ఎప్పుడు వస్తాయో అంచనా వేయలేని పరిస్థితులు ఉన్నట్లు ఎన్నోసార్లు రుజువైంది. గత ఇరవై ఏళ్లలో వాతావరణ శాఖ వర్షపాత అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే సగం శాతం కూడా సరైన సమాచారం ఇవ్వలేకపోయింది. అంచనాలు తప్పుతున్నాయనే విషయం కాదనలేం. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం మూడురకాల వాతావరణ పద్ధతులను అనుసరిస్తున్నారు. సంగ్రహ, సంఖ్యాత్మక, గణక విధానాల్లో జోస్యాలు చెబుతున్నారు. సంగ్రహ విధానం 1950 నాటిది.వాతావరణ కేంద్రాల నుంచి పాత రికార్డులను సేకరించి, విశ్లేషణ సేకరించి క్రోడీకరించి వాతావరణాన్ని అంచనా వేసే పద్ధతిఇది. గణితశాస్త్ర ఆధారంగా ప్రస్తుత వాతావరణాన్ని బట్టి భవిష్యత్ వాతావరణాన్ని అంచనా వేసేది సంఖ్యాత్మక పద్ధతి. దీనిని 1940 నుండి అనుసరిస్తున్నారు. అయితే ఈ విధానాన్ని అనుసరించడానికి ఎన్నో ఇబ్బందులున్నాయి. ఏ చిన్న పొరపాటు జరిగినా ఫలితాలు పూర్తిగా తారుమారవుతాయి. గణాంక పద్ధతులను సంఖ్యాత్మక పద్ధతితో అనుసంధానించి ఉపయోగించడం ద్వారా దీర్ఘకాలిక వాతావరణ పరిస్థితులను అంచనా వేయడంలో మంచి ఫలితాలు వస్తాయనేది నిపుణుల వాదన. ఈ పద్ధతిని అనుసరించి అభివృద్ధి చెందిన సాంకేతిక పరికరాలతో అమెరికా లాంటి దేశాలు చాలావరకు కచ్చితమైన అంచనాలు అందించడంలో ముందుకు తీసుకువెళ్తుంటే భారత్ మాత్రం కాలంచెల్లిన పరికరాలతో రైతులకు సరైన సమాచారం అందించడంలో విఫలమవుతున్నదనే విమర్శను కొట్టివేయలేం.ఆ దేశాలు వాస్తవానికి అత్యంత చేరువుగా వాతావరణాన్ని అంచనా వేయగలుగుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతగాంచిన వింబుల్డన్ టెన్నిస్ క్రీడల గురించి అక్కడ వర్షాలు ఎప్పుడు కురుస్తాయో ఎంతో ముందుగా అంతో ఇంతో కచ్చితమైన వివరాలు ఇవ్వగలుగుతున్నారు.భారతదేశంలో మాత్రంఎందుకు ఈ అధ్వాన్న పరిస్థితి దాపురిస్తుందో సామాన్యులకు అర్థంకాదు. భారత వాతావరణ పరిశోధనకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. కోల్‌కత్తా నగరాన్ని వరదలు ముంచెత్తి తీవ్రనష్టం కలగడంతో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆందోళన చెందింది. అల్పపీడనాలు,వాయుగుండాలు, తుఫాన్లు ఎండలు, రుతుపవనాలు, వర్షపాతాలువంటి సమాచారాన్ని ముందుగా సేకరించి ఇటు ప్రభుత్వాన్ని, అటు ప్రజలను హెచ్చరించడానికి 1875లో కోల్‌కతా కేంద్రంగా వాతావరణ పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అంచలంచెలుగా అభివృద్ధి చెంది దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించింది. ఇందుకోసం వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు.అయితే అందుకు కావాల్సిన, అవసరమైన అభివృద్ధిచెందిన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు సమకూర్చడంలో పాలకులు శ్రద్ధ చూపడం లేదు.మనం ఉపయోగిస్తున్న రిగ్రేషన్ మోడల్ కొన్ని పరిమితుల్లో పనిచేస్తుందని దీర్ఘకాల అంచనాలకు కొంతమేరకు ఉపయోగపడినా స్వల్పకాలిక అంచనాలకు ఉపయోగపడదని నిపుణుల అభిప్రాయం. రిగ్రేషన్ మోడల్‌తోపాటు ఆర్టిఫిషియల్, నూడల్ నెట్‌వర్క్ వంటి పద్ధతులు ఉపయోగిస్తున్నా అంత కచ్చితమైన ఫలితాలు ఇవ్వడం లేదు. అమెరికాలాంటి దేశాలు ఉపయోగిస్తున్న నేషనల్ సెంటర్స్ ఫర్ ప్రిడక్షన్ కొంతమేరకైనా వాస్తవాలకు దగ్గరగా ఉండే సమాచారాన్ని అందిస్తున్నది. త్రిడిమోడల్‌గా ఉన్న ఎన్‌సిఇపి చాలా క్లిష్టమైన వాతావరణం, సముద్రాల్లో వచ్చే మార్పును నిశితంగా పరిశీలించి పసిగట్టగలుగుతుంది. అలాంటి అభివృద్ధిచెందిన సాంకేతిక పరికరాలు, పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని అందిస్తూ ప్రజావిశ్వాసాన్ని పెంచుకుంటూ ఆయా దేశాలు పురోగమిస్తుంటే మనదేశంలో కాలం చెల్లిన పరికరాలతో కాలం గడుపుతున్నారు. ఎవరెన్ని చెప్పినా రైతుల్లో మాత్రం వాతావరణ శాస్త్రజ్ఞుల మాటలపై రాను రాను నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి. ఏదో కాకిలెక్కలు చెబుతున్నారనే అపవాదు మూటకట్టుకుంటున్నారు. చివరకు సినిమాల్లో వాతావరణ పరిశోధన కేంద్రాలపై జోకులు వేసే పరిస్థితి దాపురించింది. వ్యవసాయానికి మూలాధారమైన ఈ వాతావరణ పరి శోధన, పరిశీలనపై ఇప్పటికైనా పాలకులు దృష్టిపెట్టాలి. రుతు పవనాల గమనాన్ని వర్షపాతాలను కచ్చితంగా అంచనా వేయగల సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను శాస్త్రజ్ఞులకు అందుబాటులోకి రావాలి. కాకిలెక్కలతో రైతుల జీవితాలతో ఆడుకోవడం ఏరకంగా సమంజసంకాదు. ●

## ఒక్క మాట

# చదువు విద్యార్థుల్లో వివేకాన్ని పెంపొందించాలి

గడీల సుధాకర్‌రెడ్డి

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ సంస్కరణలు తెచ్చిన అత్యంత దుర్మార్గం విద్యతోపాటు అనేక సేవా రంగాలను ప్రైవేటీకరించడం ధనార్జనకు విచ్చలవిడిగా సరళీకరించడం వ్యాపారీకరించడం మానవ జాతి మస్తిష్కాలను మొత్తం 'ధనమేరా జీవితం' అనే విధంగా ఉసిగొల్పింది. స్వేచ్ఛగా ఆనందంగా హాయిగా అభ్యసించాల్సిన విద్యను నిర్బంధ ఒత్తిడి విధానంగా కుక్కడం కక్కడంగా మార్చడం వల్ల పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యార్థులు అనేక మంది ఆత్మహత్యలకు బలవన్మరణాలకు గురి కావడం నిత్యకృత్యంగా మారింది. పేద మధ్యతరగతి విద్యార్థులే కాదు ఉన్నత వర్గాల విద్యార్థులు ఒత్తిడి చదువుల సుడిగుండానికి సమిధలై పోతున్నారు. అయినా విద్యావ్యాపారస్తుల మనసు మారడం లేదు. ప్రభుత్వాల తీరు అంతకంటే మారడం లేదు. విద్యావ్యాపార సంస్థలు గల్లీ నుండి ఢిల్లీ వరకు చెలరేగిపోతూనేఉన్న అత్యంత దయనీయ విషాద పరిస్థితి దేశవ్యాప్తంగా నెలకొంది. విద్య విద్యార్థుల జీవితంలో ఏ రంగంలో అయినా రాణించగలం అనే ఆత్మస్థైర్యం, వివేకం కల్పించకుండా విద్య కేవలం ఉద్యోగం ఉపాధి కొరకే అన్న విష గుళికలు తల్లిదండ్రులు విద్యార్థుల శరీరంలోని అణువణువునా జీర్ణించుకపోయి, వందల ఉద్యోగాల కొరకు లక్షల మంది పోటీపడడం, పోటీలో నెగ్గని సున్నిత మనస్కులు బలవన్మరణాలకు ఆత్మహత్యలకు గురవుతున్నారు. పరోక్షంగా ఇవి వ్యాపార విద్య సృష్టించిన ప్రభుత్వాల విద్యావ్యాపారుల హత్యలే అని గమనించాలి. తల్లిదండ్రుల తీరు మారాలి. తమ పిల్లలపై ర్యాంక్‌ల ఒత్తిడి నుంచి పూర్తిగా దూరం చేస్తూ, విద్య మొత్తానికి మొత్తం ప్రభుత్వ రంగంలోనే పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయి వరకు ఉండేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. కామన్ స్కూల్ విధానం కొరకు గ్రామస్థాయి నుండి పట్టణ నగర స్థాయిలో దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాల్సిన అవసరం మెండుగా ఉంది. వ్యవసాయ రంగం బలోపేతం అయితేనే అందరికీ ఉపాధిహామీ లభించినట్లు అవుతుంది. తద్వారా దేశ ప్రజలందరికీ మంచి ఆహారం



అవసరం కావున సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టడం ప్రథమకర్తవ్యంగా తల్లిదండ్రులు స్వీకరించాలి. ఎన్ని చదువులు చదివినా పొట్టకూటికోసం అనేది నగ్నసత్యం. అసమంజస చదువులు చదవడం కంటే చదవకపోవడమే మేలు. విద్యపరమార్థం మనిషిని మనిషిగా తయారు చేయడం, తద్వారా జాతి బలోపేతం అనే భావనను విద్యావ్యాపారం పూర్తిగా పక్కతోవ పట్టించినది. ధనమేరా జీవిత సర్వస్వం అనే అసంబద్ధమైన మూర్ఖ భావన ప్రజల మస్తిష్కంలో పేరుకుపోవడం శోచనీయం. విద్య అంటే యువతను జీవితాంతం జ్ఞాన సంపాదనకు సమాయత్తం చేయడం. ఎలా నేర్చుకోవాలో తెలుపడం. పిల్లల్లో నిగూఢంగా ఉన్న శక్తియుక్తులను బహిర్గతపర్చడం, జీవితానాందానికి సోపానమని, తల్లిగర్భం నుంచి సమాధి వరకు నేర్చుకునే ప్రక్రియ అని, సమాజ వ్యవస్థను సవ్యదిశగా సమూలంగా మార్చే ప్రక్రియ అని ప్రతి విషయాన్ని ప్రశ్నించే గుణాన్ని పెంపొందించడానికని, నూతన ప్రపంచానికి తాళం చెవి లాంటిదని, ప్రకృతిసిద్ధమైన జీవనం గడపడానికి ఉపకరించే మౌలిక అంశాలతో కూడుకున్నది. ఇంకెన్నో ఉదాత్త భావనల మిళితం సమ్మేళనమే విద్య. సారాంశంగా చెప్పాలంటే విద్య మానవ సమాజాలను ఉన్నత స్థాయి నుండి ఉన్నతీకరిస్తూ పరిమళ భరితమైన జీవితాలకు తోడ్పడేది. సకలశాస్త్రాల సారం విశ్వమానవ కళ్యాణానికే అనే నగ్న సత్యాన్ని ఆకళింపు చేసుకోవడానికే. హింస దౌర్జన్యాలు దుర్మార్గాలు అరాచకాలు అవినీతి లేని సమాజాల ద్వారా ఇతర ప్రాణుల కంటే మెరుగ్గా బతకడానికే, జీవించడానికే అనే విషయాన్ని మానవ మస్తిష్కంలో జొప్పించడం విద్య విస్తృత కర్తవ్యం. అసలైన విద్య పనిమీద అభిమానం, తోటి వాళ్లను ప్రేమించడం, ప్రతి వాళ్లను బాధ్యతను నిర్వర్తించేలా ప్రోత్సహిస్తుంది. ప్రతి మనిషి నిజాయితీతో వ్యవహరించడానికి విద్య ప్రేరణనివ్వాలి. మనిషిని స్వార్థరహితునిగా మార్చడానికే విద్య ఉపకరించాలి. మానవ సంబంధాలలో ముఖ్యమైన స్వతంత్ర్యం, గౌరవం, నిజాయితీ లక్షణాలను పెంపొందించేదే అసలు సిసలైన విద్య. ఆధునిక పరిపాలకులకు ఆధునిక తాత్వికచింతనలోని పాత పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇతరుల కంటే నీతివంతుల మనిపించుకునే అన్వేషణతో స్వార్థపరులవుతున్నారు. ఇది విద్యాలక్ష్యానికి బద్ధ విరుద్ధం. ●

# ఆసియాపై అమెరికా దృష్టి పెడుతుందా?

బి. లలితానంద ప్రసాద్

ఒక దేశ విదేశీ వాణిజ్య విధానానికి అనుగుణంగానే వారి వాణిజ్య ఆర్థిక సంబంధాలు ఇతర దేశాలతో నెలకొంటాయి. అది వారి విదేశీవాణిజ్య మిగులు లేక తగులుకు కారకాలు అవుతాయి. అవి జిడిపిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. ఆయా దేశాల పౌరుల వినిమయంపైన అంశాలతో ముడిపడి ఉంటున్నాయి. సైద్ధాంతిక విబేధాలు ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఈ రీత్యా సంపన్న రాజ్యాలైన అమెరికా, చైనాలు రెండు ఎప్పటికప్పుడు వ్యూహాలకు పదును పెడుతుంటాయి. భాగస్వాముల పేరు చెప్పి పబ్బం గడుపుతూనే ఉంటాయి.వీటి వలయాల్లో బందీలుకాకుండా బడుగు దేశాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి తమను తాము రక్షించుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి.అమెరికా దేశపు చైనాలో పెట్టుబడుల నిషేధంపై కొత్తగా ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ కొందరి సునిశిత వ్యాఖ్యఇది. సాధారణంగా అమెరికాలో ప్రభుత్వాలు వ్యాపారస్తులు ఏమి చేయాలో, ఏమి చేయకూడదు నిర్దేశించరు. దీనికి కొన్ని మినహాయింపులు ఉంటాయి. అవి గ్రీన్ ఎనర్జీకి ఇచ్చే రాయితీలు. కొన్నింటికి ఆంక్షలు లాంటివి. ఈ చర్య తప్పనిసరిగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతుంది. అయినా బిడెన్ అన్నీ తెలిసి ఈమార్గాన్ని ఎంచుకున్నారు. ఈ ఆర్డర్స్ ద్వారా అమెరికా చైనాలో పెట్టుబడులపై అడ్వాన్స్, సెమికండక్టర్స్, క్వాంటం కంప్యూటర్స్ లాంటి వాటికి కావలసిన పెట్టుబడుల మీద ఆంక్షలతోపాటు కృత్రిమ మేధ, ఇతర సెమీ కండక్టర్లను చేర్చింది. బైడెన్‌ప్రభుత్వ లక్ష్యం ఉభయ దేశాల ఆర్థికసంబంధాలు విచ్ఛిన్నంకాదు. వారి దేశ భద్రతకు సంబంధించిన కీలకరంగాలని రక్షించుకోవడం అసలు లక్ష్యం. అయితే శ్వేతసౌధం విధానప్రక్రియలో ముఖ్యులు దీన్ని, వాస్తవాలను ప్రతిబింబించడం లేదు.పైగా ఉపయోగకరం కాదనిభావించడం గమనార్హం. కాలచక్రాన్ని వెనక్కి తిప్పలేం. అక్కడ చైనాలో వాటిని తమ దేశంలో ఉత్పత్తి చేయలేం అంటున్నారు. ఈ తాజా ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌లో ఏముంది అనే దానికన్నా ఏమీ లేదన్నదే ప్రధానం. అసలు సమస్య బైడెన్ను వైట్‌హౌస్ ధోరణి పరస్పర సంబంధం బీజింగ్‌పై కేంద్రీకృతమైంది. అంతకన్నా ఎక్కువ కాకుండా కనీసం సమానమైంది మరొకటి. అదే చైనా మినహా ఇతర ఆసియా దేశాలతో సంబంధాలు మెరుగుదల మౌలికమైనదిగా కొందరు భావిస్తున్నారు. అమెరికా సెక్యూరిటీ, ఆర్థికం కూడా దీనిపై ఆధారపడి ఉన్నాయి. దీని అర్థం ఇప్పటికే దీర్ఘకాల బలమైన సంబంధాలు గల జపాన్,దక్షిణకొరియాలతో బంధం పెంచుకోవడం ఒక్కటే కాదు. అదే విధంగా ఆగ్నేయాసియాలో కూడా ఉండాలి. ఇందుకు స్పష్టమైన రీతిలో చేయాల్సింది ఒక ఆసియా వాణిజ్య ఒప్పందం. గతంలో బైడెన్ ప్రభుత్వం ఇండోపసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ప్రాస్పెరటి పేరుతో 13 దేశాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఒప్పందంపై చేసిన సంతకం, ప్రకటనలు అనంతరం ఇంతవరకు ఎలాంటి ముందడుగు లేదు. పైగా ఇది పలువిధాల అందునా సుంకాల తగ్గింపులలో, మార్కెట్ విస్తరణ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో బహురూపాల విమర్శలపాలయింది. ఇదేరీతిలో బైడెన్ వైఖరి కొనసాగితే అది చైనా ప్రభావం ఈ ప్రాంతంలో పెరుగుదలకు ఉపకరిస్తుంది. అవును చరిత్ర అదే తెలుపుతుంది. గతంలో ఒబామా 12 దేశాల ట్రాన్స్‌పసిఫిక్ పార్టనర్‌షిప్, అతిపెద్ద స్వేచ్ఛ వాణిజ్య భాగస్వామ్యం సత్ఫలితాలు సాధించడంలో అంతిమంగా విఫలమయ్యారు. ఇక ట్రంప్ అయితే తన అధికార ఆసనంలో మూడో రోజే దీని నుండి వైదొలిగారు. అంతమాత్రాన ఇది అసాధ్యమేమీకాదు. పైగా మరింత తక్కువ స్థాయిలో అన్వేషణ అన్నివిధాల శ్రేయస్కరం. దీనిలో అత్యంత నిశితంగా గమనించాల్సింది, ఎదుర్కోవల్సినది కార్మిక ప్రయోజనాలు,వాతావరణ రక్షణ నియంత్రణలకు సంబంధించినవి. అమెరికా వాణిజ్య ప్రతినిధి కత్రినాతాయ్ వీటిలో నిపుణులు. సుంకాల తగ్గింపు రక్షితమార్గాల పటిష్టత కొరకు, వీటికి సంబంధించిన చక్కటి నమూనా అమెరికా, మెక్సికో, కెనడాలతో ఒప్పందం. మూడు సంవత్సరాలుగా అమలులో ఉంది. సాంకేతికంగా మెరుగుపరుచుకుంటూనే శ్రామికశక్తితో స్నేహంగా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవచ్చని నిరూపించింది. మెక్సికో ఇప్పుడు అమెరికాకి అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఈ దిశగా థాయిలాండ్ వియత్నం లాంటివి త్వరితంగా అడుగులు వేస్తున్నాయి. కానీ ఈ దేశాలకు చైనాతోనూ బలమైన సంబంధాలున్నాయి. ఇప్పటికే కొన్ని చైనా ఉత్పత్తులు సోలార్ ప్యానల్స్ లాంటివి ఈ దేశాల ద్వారా అమెరికాకి చేరుతున్నాయి.దీనిని నిరోధించాలన్నా,ఆయా దేశాల్లో చైనా ఆధిక్యత తగ్గించాలన్నా అమెరికా విస్తృత వాణిజ్య ఒప్పందాలు ఆగ్నేయాసియా దేశాలతో ఏర్పర్చుకోవాలి. తద్వారా ఆయా దేశాలలో తయారీ రంగం అన్నివిధాల వృద్ధిచెంది వారి దేశీయ అవసరాలతోపాటు ప్రపంచ అవసరాలు తీరుస్తుంది.పెద్దపెద్ద వాణిజ్య ఒప్పందాలన్నీ దీర్ఘకాల పరస్పర అనుసంధానానికి, అనుబంధానికి సూచికలు. అవి ఏదో ఒక అధ్యక్షుని లేక ప్రధాని కాలానికి పరిమితం కాదు. బిడెన్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అన్ని విధాల ఆసియాను అభివృద్ధిపరచడంలోనే దేశీయంగాను అభివృద్ధిని, భద్రతను తనదేశానికి అందివ్వగలరు. చరిత్రలో సుస్థిరస్థానం పొందగలరు. అందుకు వ్యవధి తక్కువ అనేది మరువరాదు. ఈ దిశగా ఎంతవేగంగా అడుగులు వేయగలిగితే అంత మంచిది. అది రాబోవు ఎన్నికల భవితకు ప్రాతిపదిక అవుతుంది.సంపన్న దేశాలతోపాటు ఏ రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలైనా లేక ప్రాంతీయ,భౌగోళిక,రాజకీయ ఒప్పందాలైనా ఆయాపరస్పర దేశాల ప్రజల మధ్య సుహృద్భావసంబంధాల నెలకొల్పేలా ఉండాలి. ●

## కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలి-సిఐటియు



నిరాహారదీక్షలు చేస్తున్న కార్మికులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 25, ప్రభాతవార్త : గ్రామ పంచాయితీ, స్వచ్ఛకార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ఏపి గ్రామపం చాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాబాలు ప్రభుత్వాన్ని కోరారు. పాంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా ఓడీచెరువు ఎంపిడిఓ కార్యాలయం ముందు శుక్రవారం రెండవ రోజూ కొనసాగింది. ఈ సందర్బంగా పలు కార్మిక సంఘాల నాయ కులు దీక్షలకు సంఘీబావం తెలియచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం గత 12 నెలలుగా కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుని వేతనాలు ఇవ్వకుండా తాస్సారం చేస్తోందన్నారు. కనీసం వేతనం రూ 21 వేలు ఇవ్వాలన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులను పంచాయితీ పర్మినెంట్ ఉద్యో గులుగా గుర్తించి పిఎఫ్, ఈఎస్ఐ, యూనిఫామ్, నూనె, సబ్బులు, చెప్పులుతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ స్యలు పరిష్కరించేంత వరకూ దీక్షలు కొనసాగిస్తామని ప్రభుత్వానికి హెచ్చరి కలు జారీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రమణ, సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, సిఐటియు అధ్యక్షుడు కుళ్లాయప్ప, గ్రామ పంచాయితీ కార్మికుల సంఘం యూనియన్ నాయకులు అంజినప్ప, అంజనమ్మ, రత్నమ్మ, భాగ్యమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్రిక్త వాతావరణానికి తెరతీసిన ఇంటి స్థల వివాదం

**- బాహబాహీకి దిగిన టిడిపి, వైసిపి శ్రేణులు**

**- పోలీసు అధికారుల జోక్యంతో సద్దుమనిగిన స్థల వివాదం**



నచ్చచెబుతున్న పోలీసులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 25, ప్రభాతవార్త : మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాసింగ్‌లో ఓ ఇంటి స్థలం వివాదం ఉద్రిక్త వాతావరణానికి తెరతీసింది. గత కొన్ని రోజులుగా జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి సోదరులు, తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్యల మధ్య స్థల వివాదం నడుస్తోంది. జెడ్పిటిసి దామోదర్‌రెడ్డి సోదరుడు రంగారెడ్డి మహ్మదాబాద్ క్రాసింగ్‌లో భవంతిని నిర్మించుకుని కాపురం ఉంటున్నాడు. రంగారెడ్డి ఇంటిని నిర్మించకనే వీరయ్య నివాసం ఏర్పరుచుని అందులోని ఒక గదిలో టీ దుకాణం నిర్వహించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో వీరయ్య ఇంట్లో ఇంకా మాకు స్థలం రావాల్సి ఉందని గత కొన్ని రోజులుగా దామోదర్‌రెడ్డి సోదరులు వీరయ్యతో వాదనలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఇదే విషయమై మాట్లాడుతుండగా తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. టిడిపి, వైసిపి వర్గాలు మహమ్మదాబాద్ క్రాసింగ్ చేరుకుని బహబహీకి దిగి పిడిగుద్దుల వర్షం కురిపించారు. విషయం తెలుసుకున్న నల్లమాడ సిఐ రాజేంద్రప్రసాద్‌యాదవ్, కొత్తచెరువు సిఐ రాగిరి రామయ్య, ఓడిసి, కొత్తచెరువు, అమడగూరు, బుక్కపట్నం ఎస్సైలు గోపి, లింగన్న, వెంకటనారాయణ, నరసింహుడులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమనిగిందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై గోపి తెలిపారు.

## వేరుశనగ పంట పొలాలు పరిశీలన



వేరుశనగ పంట పొలాలను పరిశీలిస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

తనకల్లు, ఆగస్టు 25, ప్రభాతవార్త: మండల పరిధిలోని తిరుమలయ్యగారిపల్లి వద్ద ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో వేరుశనగ పంట పరిశీలనలో భాగంగా తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవి రమణ, జిల్లా నాయకులు మధులు డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తనకల్లు మండల వ్యాప్తంగా కనీసం ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇంతవరకు ఒక్క పదును వర్షం కూడా కురవకపోవడం, కనీసం గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలుకు పశుగ్రాసం కూడా దొరకకపోవడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగుంటి పోతున్నాయనీ వీటికి తోడుగా మండల వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇన్పుట్ సబ్సీడి, ఇన్సూరెన్స్ 100శాతం అందేలా సంబంధిత అధికారులు నివేధిక ఇవ్వాలన్నారు. అదేవిధంగా గడ్డి, దాణా పంపిణీ కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని, హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసి సిజి ప్రాజెక్టుకు లింకు కాలువను పూర్తి చేసి నీటితో నింపాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని చెరువులకు హంద్రీనివా ద్వారా నీటితో నింపాలని, మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకాన్ని విస్తరింపచే యాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఇక్బాల్, సిపిఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మీడియా కోఆర్డినేటర్‌గా అనుమాల చౌదరి



బి:మీడియా కోఆర్డినేటర్ అనుమాల చౌదరి

కదిరి టౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త సత్యసాయి జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్‌గా కదిరికి చెందిన అనుమల చౌదరిని నియమిస్తూ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు బికె.పార్థసారధి నియామక పత్రాన్ని అందజేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆసరా కోసం పని చేస్తూ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత, గిరిజనులకు అవగాహన



మాట్లాడుతున్న రాం ప్రసాద్‌నాయక్

కదిరి, ఆగస్టు 25 ప్రభాతవార్త రూరల్ మండల పరిధిలోని బాగిరెత్తి పల్లి తాండాలో శుక్రవారం దళిత, గిరిజనులకు వివిధ రకాల అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు గంగులయ్య, డి.రాంప్రసాద్‌నాయక్‌లు హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యను కాపాడండి



మాట్లాడుతున్న మాజీ వద్యార్థి సంఘంనాయకులు

కదిరి టౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త రాష్ట్రంలో పాలకులు విద్యా సంస్కరణల పేరుతో ప్రైవేట్, కార్పోరేట్ విద్యను అందలం ఎక్కించేందుకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను విచ్చిన్నం చేస్తున్నారని, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు జివెల్.నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా ప్లీనరీ సమావేశం సందర్బంగా 2వ రోజు ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు జివెల్ నరసింహులు హాజర య్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పథకాలు, అస్తవ్యస్థ విధానాలు, జీవోల పేరుతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేస్తూ పేద విద్యార్థుల చదువును దూరం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జల్లా అధ్యక్షులు బాబావలి, నామాల నాగార్జున, బాబ్‌జాన్, పవన్, విజయ్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటింటా ఓటర్ సర్వే నిర్వహించాలి - ఆర్‌డిఓ రాఘవేంద్ర



ఓటర్‌పై అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆర్‌డిఓ రాఘవేంద్ర

నల్లచెరువు, ఆగస్టు 25, ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఇంటింటా ఓటర్ సర్వే తప్పనిసరిగా నిర్వహించాలని కదిరి ఆర్‌డిఓ రాఘవేంద్ర పేర్కొన్నారు. మండలంలోని తొలి తహసిల్దార్ కారాల యం నందు మండల బిఎల్ఓ లు, విఆర్ఓలతో సమీక్ష సమావే శం నిర్వహించారు. ఓటర్ సర్వేలో దివ్యాంగులను ఫార్మ్ 8 ద్వారా వారి వివరాలను సేకరించాలని, అలాగే 1954-2003 వరకు అసైన్ భూములను వీలైనంత త్వరగా గుర్తిం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవికుమార్, డిప్యూటి తహసిల్దార్ ఎలక్షన్ డిప్యూటి తహసిల్దార్ ముకుంద, ఆర్ఐ అశోక్‌కుమార్, విఆర్ఓలు ఓబులేసు, జ్యోతి, ఇమ్రాన్ , రబ్బాని, ముబారక్, అరవింద్ తదితులు పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 విజయోత్సవం

**- ఆకట్టుకున్న శ్రీవిజ్ఞాన్ పాఠశాల విద్యార్థుల స్పేస్ ప్రదర్శన**



చంద్రయాన్-3 నమూనాతో స్పేస్ ప్రదర్శన

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 25, ప్రభాతవార్త : జాబిల్లి దక్షిణ ధృవంపై కాలుమోపి చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ మండల కేంద్రంలోని శ్రీవిజ్ఞాన్ సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాల నుండి పోలీస్ స్టేషన్ వరకూ కరస్పాండెంట్ మస్తాన్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు శాస్త్రవేత్తలను అభినందిస్తూ ర్యాలి చేపట్టారు. స్థానిక బస్టాండ్ కూడలిలో చంద్రయాన్-3కి సంబంధించిన నమూనాలు, పరికరాలతో ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్బంగా కరస్పాండెంట్ మస్తాన్ మాట్లాడుతూ జాబిల్లిపై చంద్రయాన్-3 కాలు మోపి భారత సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. ఇది మన దేశానికి గర్వకారణం అన్నారు. 40 రోజుల పాటు చంద్రయాన్-3ను గమనాన్ని పర్యవేక్షించి సురక్షిత ల్యాడింగ్ చేయించేందుకు శ్రమించిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరాలు నొసంగే వరలక్ష్మి పాహిమాం..పాహిమాం



శివకోటిలో శ్రీలలిత కామేశ్వరి అమ్మవారు

అనంతపురం ఓల్డ్‌టౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త శ్రావణమాసంలో ఎంతో విశిష్టతను సంతరించుకున్న శ్రావణ శుక్రవారం ప్రతి ఇంటిలోనూ ఆలయాల్లోను వరాలు ఇచ్చే వరలక్ష్మిని భక్తులు దర్శించుకుని పునీతుల య్యారు. నగరంలోని శివకోటి ఆలయంలో శ్రీలలిత కామేశ్వరి అమ్మవారు వరలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శారదానాగర్‌లో శారదాంబ, హెచ్ఎల్‌సి కాలనీలోని శ్రీచాముండేశ్వరి ఆలయంలో వేదపండితులు వ్రతాన్ని భక్తులచే ఆచరింపచేశారు. ప్రతి ఇంటిలో ఉదయం నుండి పచ్చని తోరణాలతో కళకళలాడాయి. సాయంత్రం ముత్తైదువులు పట్టు చీరలు బంగారు ఆభరణాలు, ముఖానికి పసుపు చందనాలతో నుదిటిపై సింధూరం ధరించి లక్ష్మీదేవి వీధుల గుండా వస్తున్నట్లు అగుపడ్డారు. కన్య పిల్లలు సాంప్రదాయ దుస్తుల్లో లక్షణంగా అలంకరించుకుని పేరింటాకులకు వెళ్లడం తారసపడింది.

## మంచినీటి ట్యాంక్ చుట్టూ ఉన్న మురికి నీరు



అపరిశుభ్రంగా ఉన్న మంచినీరు ట్యాంక్ పరిసరాలు

నంబులపూలకుంట, ఆగస్టు 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎదరుదొన పంఛాయతీలోని దాసరవాండ్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు దగ్గరలో ప్రజలు నిత్యం నీళ్లు పట్టుకోవడానికి ఒక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వాటర్ ట్యాంక్ చుట్టు నీరు నిలువ ఉండి పాచీ తయారై దోమలు ఉత్పతికి కారణం అవుతుంది. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దోమలు అధికమై డెంగ్యూ, మలేరియా వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయనీ, గ్రామంలో ఉన్న వైద్యా ధికారులు ఈ ప్రాంతాన్ని బ్లీచింగ్ పౌడర్ చల్లకుండా ఇటువైపు కన్నెత్తి చూసిని పాపాన పోలేదు. ఇవిధంగా ఉంటే ప్రజలు రోగాల భారినపడే అవకాశాలు అధికంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలో నిరు నిలువ ఉంచకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురిగినీరు నిలువ ఉండటం వల్ల దోమల ఉత్పత్తి అధికంగా ఉంటుందని ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంప్‌లలో చెబుతున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌వద్ద మురికి నీరునిలువ ఉండకుండా శుభ్రం చేయాలని గ్రామ ప్రజలుకోరారు.

## గజగౌరి అలంకరణలో శ్రీరాజరాజేశ్వరిదేవి



శ్రీరాజరాజేశ్వరిదేవిని గజగౌరిగా అలంకరించిన దృశ్యం

తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 25 ప్రభాతవార్త పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన పురాతన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారు శుక్రవారం గజగౌరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకుని ఉదయం అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, తేజస్వామి, గంగాధర్‌శర్మలు అమ్మవారిని గజగౌరిదేవిగా ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందు స్వామి, రామకృష్ణశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీసీతారా మలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

## వివాహ వేడుకకు హాజరైన జె.సి ప్రభాకర్‌రెడ్డి



వివాహ వేడుకలకు హాజరైన టిడిపి నేతలు

యల్లనూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త మండల కేంద్రంలోని బిసి కాలనీకి చెందిన చపాలరాజు కుమార్తె వివాహానికి పలువురు టిడిపి నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహానికి హాజరైన వారిలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, శింగన మల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటి మడుగు కేశవరెడ్డి, మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు, సుబ్బరాయుడు, తదితరులు వున్నారు.

## సమస్యాత్మక గ్రామాలపై అప్రమత్తంగా ఉండండి - సిఐ



రికార్డులను పరిశీలిస్తున్న సిఐ సుబ్రమణ్యం

యల్లనూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై అప్రమత్తంగా వుండాలని రూరల్ సిఐ సుబ్రమణ్యం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలకు గొడవలు పడకుండా ముందే వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రూప్ రాజకీయాలు, రౌడీయిజం, ఫ్యాక్షన్ కార్యకలాపాలు ప్రోత్సహించే వారు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా వుంచాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల గురించి ఎస్ఐ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు.

## అర్హులైన వారందరికి పెన్షన్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

పుట్లూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేయాలని బిజెపి మండల అధ్యక్షులు కుందూ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎఒ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 సచివాయాల పరిధిలో ఈ ఏడాది జనవరి నుండి మే నెలాఖరులోపు 300 మందికిపైగా వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. వాటిలో 123 పెండింగ్ జాబితాలో వున్నాయన్నారు. 8 నెలలు కావస్తున్నా పెన్షన్లు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా దరఖాస్తున్న వారికి పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎసిసి మోర్చా మండల అధ్యక్షులు రామ్మోహన్, ఉపాధ్యక్షులు రామిరెడ్డి, నరసింహారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రామాంజులరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

**- ప్రజలకు సమయానికి అందని కుల ధృవీకరణ పత్రాలు**

**- సచివాలయ సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న గ్రామ ప్రజలు**



గ్రామ సచివాలయం -2



సచివాలయ అధికారుల కోసం ఎదురుచూస్తున్న గ్రామ ప్రజలు

నల్లచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త: ప్రజలకు మెరుగైన సేవ లు అందించాలనే ధృడ సంకల్పంతో రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థలను, వాలంటీర్ వ్యవ స్థను ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుండ విధులకు హాజరవుతున్నారని ప్రజలు ఆవేధన వ్యక్తం చేశారు. మండంలోని సచివాలయం-2 ఎదుట లబ్ధిదారులే కాదు అధికారులు సైతం సచివాలయం ఎదుటు వేచి ఉండాల్సిన దీనస్థితి ఏర్పడింది. రోజువారి సచివాలయంకు తాళాలు తీసె వెల్ఫేర్ రానందున మద్యాహ్నం 12 గంటలు అయినా సచివాలయం తెరుచుకోక పోవడంతో ప్రజలు, లబ్దిదారులు వేచి చూడాల్సివచ్చింది. ఇక చేసేదిమిలేక అధికారులు తాళాలు పగలగొట్టే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు తాళాలు అందడంతో సచివాలయం తెరిచి 12 గంటల సమయంలో రిజిస్టర్ నందు సంతకాలు చేసి విధులను ప్రారంభించారు. భవిష్యత్తులో ఈ విధంగా మళ్లీ పునరావృత్తం అవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా



జాబ్‌మేళాలో ఎంపికైన వారితో కళాశాల సిబ్బంది

తాడిపత్రిరూరల్, ఆగస్టు 25 ప్రభాతవార్త తాడిపత్రి పట్టణ శివారులోని ఆటోనగర్ సమీపంలో వున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎపిఎస్ ఎస్‌డిసి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 530 మంది విద్యా ర్థులు పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో పది కంపెనీల వారు పాల్గొన్నారు. ఇందులో 182 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.శైలేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగం సాధించి వారి కుటుంబానికి అండగా వుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది టిపిఒ సునీల్‌కుమార్, జి.వీరస్వామి, బి.మద్దయ్య, ఒ.చంద్రమోహన్, సుబహాన్, రాజేంద్రప్రసాద్, స్కిల్ దవలప్‌మెంట్ సిబ్బంది రాజశేఖర్, స్రవంతి, మహేష్ పాల్గొన్నారు.

## 30వవార్డులో సమస్యలు పరిష్కరించండి



కమీషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్ మల్లికార్జున

తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 25 ప్రభాతవార్త తాడిపత్రి పట్టణంలోని 30వవార్డులోని భగత్‌సింగ్‌నగర్, టీచర్స్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ మల్లికార్జున శుక్రవారం మున్సిపల్ కమీషనర్ రవిని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ 30వవార్డులో వీధిలైట్లు సరిగా లేనివి చాలా రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీలైనంత త్వరగా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కమీషనర్‌ను కోరారు. కమీషనర్ సానుకూలంగా స్పందిస్తూ వారం రోజుల్లో వీధిలైట్ల సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా అండర్‌డ్రైనేజి సమస్యపై చర్చించారు. డ్రైనేజి సమస్య విషయానికి వస్తే ఎస్‌టిపి 2 పంప్‌హౌస్ పాడై డ్రైనేజి సమస్య వచ్చిందని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కమీషనర్ హామి ఇచ్చారు.

## ఉపాధిహామి పనులను పరిశీలించిన ఏపిడి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిడి వెంకటరత్నం

పుట్లూరు, ఆగస్టు 25 ప్రభాతవార్త మండలంలోని గాండ్లపాడు, తక్కళ్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామి పనులను శుక్రవారం ఎపిడి వెంకటరత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేయాలన్నారు. ఎండలు అధికంగా వున్నం దున ఉదయమే పనులకు వచ్చి కొలతల మేరకు పనులు చేయాలని కూలీలకు సూచించారు. అంతేకాకుండా పెండింగ్‌లో వున్న ఎన్‌పిసిఐ ఖాతాలను ఈ నెలాఖరులోగా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసి విజయ్, ఎపిడి అసిస్టెంట్ నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## తేదేపా నాయకుల అనుచిత వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం



ఎంఎస్ఐకి వినతిపత్రం అందచేస్తున్న వైకాపా సోషల్ మీడియా బృందం

యాడికి, ఆగస్టు 25 ప్రభాతవార్త వచ్చే ఎన్నికల్లో తాము గెలవలేమని తెల్సి రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించి అయినా అధికారంలోకి రావాలని టిడిపి కుట్రలు పన్నుతోం దని ఇందుకు మాచెర్ల, పుంగనూరు, ఘటనలే నిదర్శనమని అందుకు తోడు మీ మీద కేసులు వుంటే నామినేటెడ్ పదవులు ఇస్తామని నారా లోకేష్ బహిరంగంగా టిడిపి కార్యకర్తలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వైకాపా నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. శాంతిభద్రతలకు కాపాడాలని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరుతూ శుక్రవారం యాడికి పోలీసుస్టేషన్‌లో ఎఎస్ఐకి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా యాడికి మండల కన్వీనర్ పటాన్ ఫరూక్, రాజుయాదవ్, చౌదరి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన మహిళకు ఆర్థిక సాయం



కాయల బాలయ్యకు 20 వేలు అందచేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

యాడికి, ఆగస్టు 25 ప్రభాతవార్త మండలంలోని రామరాజు పల్లి గ్రామానికి చెందిన కాయల బాలయ్య భార్య కాయల నాగరత్న ప్రమాద వశాత్తు ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహి ంచాలని వైద్య నిపుణులు పేర్కొనడంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి శుక్రవారం రామరాజుపల్లి గ్రామానికి వెళ్లి 20 వేల రూపాయలను ఆ కుటుంబానికి అందచేశారు. ఈ కార్య క్రమంలో వైకాపా నాయకులు తలారి నాగేష్, తూట్రాళ్లపల్లి సర్పంచు సంజీవరాయుడు, నారాయణరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ముదిగుబ్బ సిఐగా బాధ్యతలు

ముదిగుబ్బ, ఆగస్టు 25 ప్రభాతవార్త ముదిగుబ్బ సిఐగా యతేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సామాన్యులకు సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మండలంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు,. మండలంలో మట్కా, గ్యాంబ్లింగ్, ప్రభుత్వ నిషేధిత వస్తువులను ఎవరైనా చట్టాన్ని దిక్కరించి ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై ప్రత్యేక నిఘా వుంచి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముదిగుబ్బ సర్కిల్ పరిధిలో ఒకేసారి ఎస్ఐ, సిఐల బదిలీలు జరగడంతో ఇక్కడ సిఐగా బాధ్యతలు చేపట్టానని అదేవిదంగా త్వరలోనే ఎస్ఐ కూడా బాధ్యతలు చేపడతారని ఆయన తెలిపారు. ప్రశాంతంగా వున్న గ్రామాల్లో ఎవరైనా అరాచకశక్తులు అశాంతి నెలకొల్పేందుకు ప్రయత్నిస్తే అటువంటి వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇక్కడ వున్న సిబ్బంది సమన్వయంతో విధులను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన తెలియచేశారు.

## కన్నుల పండుగలా మహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవ వేడుకలు




లక్ష్మిదేవి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారు,లక్ష్మిదేవి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



అమ్మవారి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం

**బత్తలపల్లి, ఆగష్టు 25 ప్రభాతవార్త :** మండల కేంద్రం లోని వడ్డెర కాలనీలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవ వేడుకలను కన్నుల పండుగలా నిర్వహించారు. శుక్రవారం శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతంను పురస్కరించుకుని అమ్మవారిని అందంగా అలంకరించారు. ఉదయం నుండే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన వెండిరథంపై పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రమణయ్య, ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి, శ్రీనివాస కళ్యాణ మండపం ప్రారంభం- తరలివచ్చిన భక్తులు




కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

విశేష పూజలందుకుంటున్న పద్మావతి, శ్రీనివాసులు



కళ్యాణోత్సవం గురించి వివరిస్తున్న పురోహితులు

**బత్తలపల్లి, ఆగష్టు 25 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని వడ్డెర కాలనీలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం పక్కన నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి, శ్రీనివాస కళ్యాణ మండలపంను వేదపండితుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. గత మూడు రోజులుగా వేదపండితులు ఆలయ అర్చకులు రమణయ్య ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం కళ్యాణ మండపంలో పద్మావతి, శ్రీనివాసుల కళ్యాణం నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవింద నామంతో హోరెత్తించారు. తొలుత మహాలక్ష్మి అమ్మవారి పూజలు నిర్వహించిన అనంతరం బలిహరణ, పద్మావతి, శ్రీనివాసుల కళ్యాణోత్సం నిర్వహించారు. అంతకుముందు గోపురకళశ ప్రతిష్ఠ, శ్రీ మహాలక్ష్మి హోమం, శ్రీ సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, గోపుర కళశాభిషేకం, చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నధానం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎదురుకోళ్ల ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్డె వెంకట్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వైసి తిమ్మారెడ్డి విగ్రహ ఆవిష్కరణకు హాజరైన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



మాజీ ఎమ్మెల్యే వైసి తిమ్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్సే గుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** పట్టణంలో మడకశిర మాజీ ఎమ్మెల్యే వైసి తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మడకశిర మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి, నూతన గృహ ప్రవేశానికి హాజరైన మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి మడకశిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మి వేడుకలు



**అగళి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** వరలక్ష్మి పండుగను పురస్కరించుకుని ముఖ్యంగా మహిళలు, వారి వారి ఇళ్లల్లో వర మహాలక్ష్మిని ఏర్పాటు చేయడం, డబ్బులతో అలంకరించడం, వివిధ రకాల పూలతో అలంకరించడం చేశారు. మరీ ముఖ్యంగా లక్ష్మికి తామర పువ్వు అంటే ఇష్టం కావున ఆ పూలతోనే అలంకరించారు. అదే విధంగా కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో లక్ష్మి పూజను, వరలక్ష్మి పండుగను పురస్కరించుకుని నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు అరటి, మామిడి తోరణాలతోపాటు వివిధ రకాల పూలతో దేవిని అలంకరించి వేకువ జామునుండే పూజల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో వరలక్ష్మి పండుగ పూజలను ఘనంగా నిర్వహించుకున్నారు.

## నోట్లపై కొల్హాపురి మహాలక్ష్మి అలంకరణ



**అగళి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** రత్నగిరి గ్రామంలో వెలిసిన పురాతన, కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారిని రెండు రోజులపాటు నోట్లతో అలంకరణ చేశారు. పూజారి జ్ఞానేంద్ర ఆచారి శ్రమ పడి నోట్లతో మహాలక్ష్మిని అలంకరించారు. వర మహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ఇలా అలంకరించినట్లు పూజారి ప్రభాతవార్తతో తెలిపారు. ప్రతి శుక్రవారం రోజు మహాలక్ష్మికి అగళి, రొళ్ల మండలాల నుంచే కాక, మడకశిర నియోజకవర్గం కర్ణాటక మధుగిరి, శిర, చుట్టుపక్కలప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దేవి పూజకు హాజరవుతారు. కొల్హాపురి మహాలక్ష్మి పూజతోపాటు మహిళలు గంగపూజ చేయడం దేవికి హారతులు పట్టడం, ఆ మొక్కులను బట్టి దేవికి పూలహారాలు వేయించడం లాంటివి చేయిస్తారు. ఇలా దేవికి పూజలు చేయిస్తే అన్ని మంచి జరుగుతాయని, శుభాలు జరుగుతాయని దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని భక్తుల విశ్వాసం. ప్రతి సోమవారం, శుక్రవారం, మంగళవారం మహాలక్ష్మికి, మహాలక్ష్మి పూజకు వెళ్లిన భక్తాదులకు అన్నదానం చేయడం ఆనవాయితీ. వందల ఏళ్లనాటి పురాతనమైనది ఈ కొల్హాపురి మహాలక్ష్మి.

## మోకాళ్లపై నిరసన వ్యక్తం చేసిన కార్మికులు



నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు

**కొత్తచెరువు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కేశాపురం పంప్ హౌస్ వద్ద శ్రీసత్య సాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 572 మంది కార్మికులు కాంట్రాక్టు ఉద్యోగులుగా చేస్తున్నారని, అరకొర జీతాలతో తమ కడుపులు ఎలా నింపుకోవాలని వారు ప్రశ్నించారు. జీతాలు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో మా జీవితాలు అంధకారంగా మారాయని, ప్రభుత్వంపైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బాబా ఫక్రొద్దీన్, రాము, సత్యనారాయణ, శ్రీనివాసులు, రంగప్ప, రంగారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

-అర్హులైన వారికి వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జగదీష్



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు జగదీష్



సమావేశంలో పాల్గొన్న మహిళలు

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుంటే ప్రభుత్వం 144 సెక్షన్ విధించి అక్రమ అరెస్టులకు పాల్పడిందని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జగదీష్ ఆరోపించారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేగ్రౌండ్ కమ్యూనిటీహాల్ ఆవరణలో ఇళ్ల స్థలాలు లేని వారికి వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఇంటి స్థలాలు లేని వారితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి జగదీష్ మాట్లాడుతూ పేద ప్రజలు బాడుగ ఇళ్లలో వుంటూ బాడుగలు చెల్లించలేక దుర్భరపరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలో ఇంకా 20 వేల మంది ఇళ్లు లేని వారు వున్నారని గుర్తుచేశారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న ప్రభుత్వ జిఒ ఎక్కడ వుందన్నారు. తెలంగాణ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం 4 లక్షలు కేటాయించాలన్నారు. అలాగే టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలన్నారు. ఈ విషయాలపై ప్రభుత్వ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కసాపురం రోడ్డులోని 315, 318 సర్వేనెంబర్లలోని 4ఎకరాల భూమిని పేదలకు కేటాయించాలన్నారు. అలాగే 47గజాలు కాకుండా వంద గజాలు కేటాయించాలన్నారు. తహశీల్దార్ రాము అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న వారు అర్హులని తేలితే వారికి 15 రోజుల్లో ఇంటి స్థలాలు కేటాయిస్తామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం కార్యదర్శివీరభద్రస్వామి,సహాయ కార్య దర్శి మహేష్, మండల కార్యదర్శి రాముడాయల్, నాయకులు ఉమర్‌బాష, గడ్డం వెంకటేష్, సిపిఐమండలసహాయకార్యదర్శి రామాంజినేయులు యాదవ్, మురళీకృష్ణ, గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వేలో అవకతవకలకు అవకాశం ఇవ్వరాదు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**గుత్తి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా ఓటర్ల సర్వే వ్యవహారంపై ఎటువంటి లోటుపాట్లు అవకతవకలకు ఆస్కారం లేకుండా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని డిఎల్‌పిఒ ప్రభాకర్‌రావు, గుంతకల్లు ఆర్డీఒ రవీంద్రలు ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహబూబ్‌బాష ఆధ్వర్యంలో బిఎల్ఒలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అవకతవకలకు పాల్పడిన పక్షంలో సంబంధిత బిఎల్ఒలు బాధ్యత వహించాల్సి వుంటుందన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని వారు ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవరలక్ష్మీవ్రతం



మహిళలు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 25 ప్రభాతవార్త :** పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో శుక్రవారం శ్రీవరలక్ష్మీవ్రతాన్ని ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, వాసవిక్లబ్, యువజన సంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీవరలక్ష్మీవ్రత విశిష్టతను అర్చకులు వాసుదేవాచార్యులు మహిళలకు వివరిం చారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. వేకువజామునే మహిళలు తలస్నానం చేసుకుని ఇంటిని శుభ్రం చేసుకుని చక్కగా అలంకరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇంటి పరిసరాలు, మహిళలు అందంగా అలంకరించుకుంటే అమ్మవారి కృపాకటాక్షాలు తమ గృహంపై వుంటాయని భావిస్తారు. ముత్తైదువులను గాజులు, పసుపుకుంకుమ, రవిక, పండ్లు, తాంబూలాలతో సత్కరించారు.

## కంది, వేరుశెనగ పంట పొలాలు పరిశీలించిన ఏఓ

- వర్షాభావ పరిస్థితుల్లో పంటలను రక్షించుకోవడంపై రైతులకు సూచనలు

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నముష్టూరు, కోనాపురం గ్రామాల్లో రైతులు ఖరీఫ్ పంట కాలంలో సాగు చేస్తున్న వేరుశెనగ, కంది పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ పరిశీలించారు. చిన్నముష్టూరు గ్రామంలో రైతు రామాంజినేయులు సాగు చేస్తున్న కంది పంటను పరిశీలించిన ఏఓ వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుకు అవగాహన కల్పించారు. మరో వారం పదిరోజుల్లో వర్షాలు రాకపోతే పంటలు ఎండిపోతాయని ఆ పరిస్థితి నుండి పంటలను కాపాడుకోవడానికి యూరియా 20 గ్రాములు 1 లీటర్ నీటితో లేదా పోటాషియం నైట్రేట్ 5 గ్రాముల మందును 1 లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నముష్టూరు గ్రామ సర్పంచ్ రామాంజినేయులు, ఆర్బీకే సిబ్బంది చిక్కన్న, గోపాల్‌నాయక్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో విచారణ పూర్తి చేస్తాం..!

-డీఆర్‌డీఏ ఏపీడీ బి.ఈశ్వరయ్య



విలేఖరులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ బి.ఈశ్వరయ్య. చిత్రంలో చేయూత డీపీఎం సత్యనారాయణ ఉన్నారు.

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త :** వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామానికి చెందిన శివగణేష్ మహిళా సంఘానికి రుణం మంజూరులో జరిగిన అక్రమాలపై వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదికను పీడీకు అందజేస్తామని డీఆర్‌డీఏ ఏపీడీ బి.ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో ఆయన తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. ఇప్పటికే అక్రమాలకు పాల్పడ్డ ఆనిమేటర్ (వీఓఏ) మహాలక్ష్మిను తొలగించడం జరిగిందన్నారు. కాగా ఏపీడీ విలేఖరుల సమక్షంలోనే వజ్రకరూరు మండల వైకేపీ ఏపీఎం గుణశ్యామ్, సీసీ రామాంజినేయుల నుండి వివరాలు సేకరించారు. ఏపీఎం మాట్లాడుతూ ఉరవకొండ ఏపీజీబీలోవున్న కావేరి మహిళా సంఘం పేరును ఆనిమేటర్ భర్త డీటీపీలో తొలగించి శివగణేష్‌గా మార్చి నకిలీ బ్యాంకు స్టేట్‌మెంట్లు సృష్టించాడన్నారు. సీసీ రామాంజినేయులు మాట్లాడుతూ తన సంతకాన్ని ఆనిమేటర్ భర్త ఫోర్జరీ చేశాడన్నారు. డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించకుండానే ఎస్‌బీఐ అధికారులు 10 లక్షల రుణం మంజూరు చేయగా అందులో 5 లక్షల మహిళా సంఘం సభ్యులకు ఇచ్చి వారితోనే తనకు కావలసిన కుమారప్ప అనే వ్యక్తి ఖాతాలోకి 4.3 లక్షలు, మరో 40వేల రూపాయలను ఆనిమేటర్ భర్త లాలుస్వామి తన ఖాతాలోకి వేయించుకున్నాడన్నారు. ఈ విషయం సదరు సంఘం సభ్యుల ఆందోళనలతో బయట పడగానే బ్యాంకుకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడి డబ్బును వెనక్కు కట్టించామన్నారు. ఆనిమేటర్ భర్త సమర్పించిన డాక్యుమెంట్లు క్షుణ్ణంగా పరిశీలించగా మైగ్రేట్ సంఘమంటూ చూపిన సంఘం శివగణేష్ కాదని కావేరి సంఘమని తేలిందని వివరించారు. సీసీ సంతకం ఫోర్జరీ, సంఘం పేరునే మాఫింగ్ చేయడం లాంటి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయమై పూర్తి విచారణ అనంతరమే నిర్ణయం తీసుకుంటామని ఏపీడీ చెప్పారు. ఆయన వెంట చేయూత డీపీఎం సత్యనారాయణ ఉన్నారు.

## కోనాపురం విద్యుత్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన అన్నదాతలు

- వ్యవసాయానికి 2 గంటలు కూడా విద్యుత్ అందించడంలేదని ఆగ్రహం - పంటలు ఎండిపోతున్నాయని మిరప చెట్లతో సబ్ స్టేషన్‌లో బైటాయింపు



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించి ఎండుతున్న మిరప చెట్లతో బైటాయించిన అన్నదాతల దృశ్యం



సబ్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోనాపురం గ్రామ సమీపంలో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారికి పక్కనగల విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం చిన్నముష్టూరు, పెద్దముష్టూరు, ఇంద్రావతి, మోపిడి గ్రామాలకు చెందిన అన్నదాతలు ముట్టడించారు. వ్యవసాయానికి ప్రభుత్వం 9 గంటల పాటు విద్యుత్ అందిస్తున్నామని చెబుతోందని అయితే వాస్తవానికి రోజుకు 2 గంటలు కూడా విద్యుత్ అందడం లేదంటూ సబ్ స్టేషన్‌లోని కార్యాలయం ముందు ఎండుతున్న మిరప చెట్లతో బైటాయించి 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తాము బోర్లు, బావులు, హంద్రీనీవా కాలువ కింద వేలు, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి మిరప సాగు చేసుకొంటుండగా రోజుకు 2 గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో కళ్లముందరే మిరప పంట ఎండిపోతోందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో సబ్ స్టేషన్‌ను ముట్టడించాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు రోజుకు నిరంతరాయంగా 9 గంటలపాటు విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. తమకు అధికారుల నుండి కచ్చితమైన హామీ లభించేంతవరకు కదిలేది లేదని రైతులు భీష్మించగా సబ్ స్టేషన్ సిబ్బందితో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ టి.పి.వెంకటస్వామి వెంటనే అక్కడికి చేరుకొని విద్యుత్‌శాఖ అధికారులతో రైతులను మాట్లాడించి వారిని శాంతిపజేయగా వారు ఆందోళన విరమించారు.

## రాయంపల్లి గ్రామంవద్ద హెచ్ఎల్‌సీలో కౌలు రైతు గల్లంతు..!

- ఆయిల్ ఇంజన్‌కు విద్యుత్ వైర్లు లాగుతుండగా ప్రమాదం

- నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన హరిజన మల్లికార్జున



గల్లంతైన హరిజన మల్లికార్జున (ఫైల్‌ఫోటో)

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాయంపల్లి గ్రామంవద్ద నిండుగా ప్రవహిస్తున్న హెచ్ఎల్‌సీలో (తుంగభద్ర హైలెవెల్ కెనాల్) ప్రమాదవశాత్తు పడిపోయిన అదే గ్రామానికి చెందిన హరిజన మల్లికార్జున అనే కౌలు రైతు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి అనే రైతుకు చెందిన 14 ఎకరాల భూమిని చెరో 7 ఎకరాల చొప్పున అదే గ్రామానికి చెందిన హరిజన మల్లికార్జున, లోకేష్‌లు గుత్తకు (కోరుకు) సాగు చేసుకుంటున్నారు. ఈక్రమంలోనే తాము గుత్తకు సాగు చేసుకొంటున్న భూమిలో పంటలకు కాలువలో ఏర్పాటు చేసుకున్న ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని అందించడం కోసం శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ తీగలను ఇవతలి గట్టు నుండి అవతలి గట్టుకు కాలువ గుండా లాగుతున్న సమయంలో కాలువలో పడిపోయి నీటి ప్రవాహానికి మల్లికార్జున కొట్టుకుపోయాడు. దీంతో ఆ సమయంలో అక్కడేవున్న లోకేష్, భూమి యజమాని తనయుడు సురేంద్రరెడ్డి అతని కోసం గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో విషయాన్ని గ్రామస్థులకు తెలియజేయడంతో అందరూ అక్కడికి చేరుకొని గల్లంతైన మల్లికార్జున కోసం కాలువలో గాలించినా అతని ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు.

## మొదలైన శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల సమ్మె

- నియోజకవర్గంలో 57 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త :** శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల సమ్మె శుక్రవారం మొదలైంది. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో కార్మికులు ఈనెల 20 నుండి 24 వరకు పంప్‌హౌస్‌లవద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టి ఆలోపు సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళతామని అల్టిమేటం జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం, అధికారుల్లో చలనం లేకపోవడంతో కార్మికులు శుక్రవారం ఉదయం పంప్‌హౌసుల్లో స్విచ్ ఆఫ్‌చేసి గ్రామాలకు నీటి సరఫరాను నిలివేశారు. దీంతో ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దకౌకుంట్ల, వై.రాంపురం, గడేకల్లు, ఛాయాపురం, కొనకొండ్ల గ్రామాల్లోని పంప్‌హౌసుల పరిధిలోని 57 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమకు రావాల్సిన 5 నెలల జీతం వెంటనే చెల్లించాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు, బోనస్, సమాన పనికి సమాన వేతనం అందించాలని, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బు కట్టాలని డిమాండ్ చేశారు.

## ఉరవకొండకు చేరిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర



క్లాక్‌టవర్ కూడలిలో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రలో మాట్లాడుతున్న నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త :** జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఎస్ఎఫ్ఐ ఈనెల 20వ తేదీ నుండి 28 వరకు చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర శుక్రవారం సాయంత్రం ఉరవకొండ పట్టణం చేరుకుంది. స్థానిక క్లాక్‌టవర్ కూడలిలో సైకిల్ యాత్రను యుటీఎఫ్ మండల నాయకులు శీను, రాజశేఖర్, రఘు, ఎస్ఎఫ్ఐ స్థానిక నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి సిద్దార్థ తదితరులు మాట్లాడుతూ జిల్లాలో సెంట్రల్ యూనివర్సిటీ సంబంధించి తొమ్మిదేళ్ళు కావస్తున్నా కనీసం ప్రహరీగోడ నిర్మాణం కూడా పూర్తి చేయలేదని, అధ్యాపకుల పోస్టుల భర్తీ ఊసే లేదన్నారు. సంక్షేమ వసతిగృహాల భవనాలు పెచ్చులూడి విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారని వాటికి కనీస మరమ్మతులు చేయించలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇవ్వడంలేదని, శింగనమల, ఉరవకొండ, ఆత్మకూరు. తాడిపత్రి, గుత్తి జూనియర్ కళాశాలల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రజిత, సునీత, శివ, రమేష్, తరిమెల గిరి, శివ, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పులుచేసి ప్రజా సమస్యలు పరిష్కరించే దుస్థితి ఇంకెన్నాళ్లు..!

-సీయంగారు..కష్టాలు పడుతున్నాం..బటన్ నొక్కి పంచాయితీలకూ నిధులివ్వండి -అధికార వైసీపీకు చెందిన షేక్షానుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ లింగన్న ఆవేదన -అధికారులేరాని సమావేశాలెందుకంటూ మండల కోఆప్షన్ సభ్యుడు సలీమ్ వాకౌట్ -ఉరవకొండ మండల సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సర్పంచుల నిరసనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చందా చంద్రమ్మ



నిధులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్న షేక్షానుపల్లి గ్రామ సర్పంచ్ లింగన్న



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫమిదాను ప్రశ్నిస్తున్న అధికార పార్టీ ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్

**ఉరవకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త**

పంచాయతీలో నిధులులేని కారణంగా మాకు ఓట్లేసి గెలిపించిన ప్రజల సమస్యలను తీర్చడానికి అప్పులు చేయాల్సి వస్తోందని ఈ దుస్థితి ఇంకాన్నెళ్లు కొనసాగుతుందని అధికార వైసీపీకు చెందిన షేక్షానుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ లింగన్న అవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్లు నొక్కి ప్రజలకు వివిధ పథకాలకింద డబ్బులు ఇస్తున్నారుగాని పంచాయతీల్లో నిధుల లేమితే సమస్యలు పరిష్కరించలేక, అభివృద్ధి పనులు చేయించలేక సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మాత్రం గుర్తించడం లేదని ఆయన వాపోయారు. ఉరవకొండ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చంద్రమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ ఆధ్వర్యంలో జరుగగా జెడ్పీటీసీ ఏ.సి. పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు తదితరులు హాజరయ్యారు. సభ ఆద్యంతం అధికార పార్టీకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ నిరసల మధ్య కొనసాగింది. వివరాల్లోకి వెళితే... షేక్షానుపల్లి సర్పంచ్ లింగన్న మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 8 తాగునీటి సరఫరా బోర్లు ఉండగా అందులో 4 బోర్లు కాలిపోయాయని వాటి మరమ్మతులకు డబ్బులేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమం నిధులు 20 లక్షలు, మండల పరిషత్ ద్వారా పంచాయతీకు 14 లక్షల నిధులు ఇచ్చామని అయితే పనులు మాత్రం చేయలేదన్నారు. సర్పంచ్ లింగన్న మాట్లాడుతూ బిల్లులు పండటంలేదని పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. ఈ పరిస్థితుల్లో పనులు చేయించడం మాచేతకాదని మీరే చేయించాలన్నారు. ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ మండలానికి గడప గడపకు కార్యక్రమం కింద 92 పనులు మంజూరుకాగా 15 ఆర్‌డబ్ల్యూఎస్ పనులే పెండింగ్‌లో ఉన్నాయని వాటని పూర్తి చేయిస్తామని గ్రామంలో మోటార్ల సమస్యను పంచాయతీ నిధులతో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రేణిమాకుపల్లి గ్రామ సర్పంచ్ బోయ రామాంజినేయులు మాట్లాడుతూ మా పంచాయతీకు గడప గడపకు నిధులు ఎంత వచ్చాయో ఏఏ పనులు జరుగుతున్నాయో కూడా తనకు తెలియదని చెప్పగా ఎంపీపీ మీరు సర్పంచా? అంటూ ప్రశ్నించడంతో అందరూ అవాక్కయ్యారు. దీంతో ఎంపీడీఓ కలుగజేసుకొని సాయంత్రంలోగా పూర్తి సమాచారం ఇస్తామన్నారు. నెరమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి మాట్లాడుతూ మా పంచాయతీలో ఏ నిధుల కింద ఏఏ పనులు జరుగుతున్నాయో కూడా తమకు తెలియదని సర్పంచులకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సమావేశానికి అధికారులే రానపుడు మేము సమావేశంలో ఉండటం అర్థం లేనిదంటూ అధికార పార్టీకు చెందిన మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్ వాకౌట్ చేశారు.

**ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా కుళాయిలు వేయించడం ఆపండి :** తాగునీటి సరఫరాపై చర్చలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫమీదా మాట్లాడుతూ పట్టణంలో తమ ప్రమేయం లేకుండా కొందరు ప్రజా ప్రతినిధులే దగ్గరుండి ఇష్టారాజ్యంగా కుళాయిలు వేయిస్తున్నారని దీంతోనే అన్ని ప్రాంతాలకు స క్రమంగా నీటని సరఫరా చేయలేకపోతున్నామన్నారు. కొందరు కుళాయిలు వేయిస్తూ డబ్బులు కూడా వసూళు చేసుకొంటున్నారని తమదృష్టికి కూడా వచ్చిందన్నారు. అధికార పార్టీకే చెందిన ఎంపీటీసీ వన్నూరుసాబ్ మాట్లాడుతూ పట్టణంలో 20 రోజులకు ఒకసారి కూడా తాగునీటిని ప్రజలకు అందించకపోవడం దారుణమని శివారు కాలనీల్లో తాగునీటి సమస్యల తీవ్రంగా ఉందని వాపోయారు. దీంతో ఏఈ ఫమీదా మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి, సీపీడబ్ల్యూ రెండు స్కీముల నుండి నీరు వస్తే మూడు నాలుగు రోజులకొకసారి నీరిస్తామని శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె, ఇతరత్రా కారణాలతో నీరు సరిగ్గా రాకపోవడం, సీపీడబ్ల్యూ స్కీమ్‌లో ఎస్ఎస్ ట్యాంకులు అడుగంటిపోవడంతో సమస్యలు నెలకొందని, ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు చేయిస్తున్నామని త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

**సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలకు సిఫార్సు :** మండల సమావేశానికి కొన్ని శాఖలకు చెందిన అధికారులు ఉద్దేశపూర్వకంగానే హాజరు కావడంలేదని వారిపై చర్యలు తీసుకోవాలని వారి శాఖల ఉన్నతాధికారుల తోపాటు కలెక్టర్, కమీషనర్, జెడ్పీ సీఓలకు సిఫార్సు చేస్తామని ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ ప్రకటించారు. ఉదయం 9 గంటలకు సమావేశమని ప్రకటించినా 11 గంటల సమయంలోనే నాలుగైదు శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరుకాగా వారితోనే సమావేశం చేపట్టి రాని శాఖల అధికారుల వివరాలను నమోదు చేసుకున్నారు.

05ATP27_05ATP27.qxd 25-08-2023 PM 11:25 Page 1



# అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు రూ.3 లక్షలు

- కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు
- విచారణ చేపట్టన సబ్ కలెక్టర్



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిడిపిఓ అంగన్‌వాడీ

**పెనుకొండ, ఆగస్టు 25 ప్రభాతవార్త**

అంగన్‌వాడీ ఆయా స్థాయి నుంచి కార్యకర్త స్థాయికి ఉద్యోగన్నతి పొందేందుకు సిడిపిఓకు రూ.3 లక్షలు ఇచ్చారని ఆరోపిస్తూ గోరంట్ల మండలం వానవోలు గ్రామస్తులు జిల్లాక లెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ శుక్రవారం విచారణచేపట్టారు. గోరంట్ల మంలడం వానవోలు 1 అంగన్‌వాడీ కేంద్రంలో మే నెలలో కార్యకర్త పదవీవిరమణ పొందారు. దీంతో ఆయాగా పని చేస్తున్న శోభాను అంగన్‌వాడీ కార్యకర్తగా తీసుకునేందుకు సిడిపిఓ అనురాధ జిల్లా అధికారులకు నివేదిక పంపారు. అన్నివిధాలా అర్హత ఉందని శోభాను క ఆర్యకర్తగా తీసుకు నేందుకు ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై గ్రామ సర్పంచు శ్రీరాములుతో సహా మరికొందరు గ్రామ ప్రజలు అక్రమ మార్గంలో సిడిపిఓ రూ.3 లక్షలు తీసుకుని శోభకు కార్యకర్త పోస్టు ఇచ్చారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నోటిఫికేషన్ ఇచ్చి కార్యకర్త పోస్టు భర్తీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలోసిడిపిఓ అనురాద, అంగన్‌వాడీ కార్యకర్త శోభలను సబ్ కలెక్టర్ విచారించారు.

**నిబంధనల ప్రకారం కార్యకర్తగా ఎంపిక చేశాం.. సిడిపిఓ :** నిబంధనల ప్రకారమే శోభాను అంగన్‌వాడీ కార్యకర్తగా ఎంపిక చేస్తామని సిడిపిఓ అనురాధ అన్నారు. గ్రామంలో విచారణ చేశామని, తల్లుల కమిటీ తీర్మాణం చేశారని అన్నారు. మూడు లక్షలు తీసుకుని కార్యకర్తపోస్టు ఇచ్చామనడం బాధాకరం అన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడ లేదని సిడిపిఓ తెలిపారు.

# అనంతపురం డీఈఓగా నాగరాజు నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ కమిషనర్



డీఈఓగా నియామకమైన నాగరాజు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఎసి)గా నాగరాజును నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు పని చేస్తున్న డీఈఓ సాయిరామ్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో గత వారం రోజులుగా బెంగుళూరులోని ఎస్టేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పూర్తిగా కోలుకుని విధులకు హాజరు కాలేకపోతుండటంతో జిల్లా విద్యాశాఖపాలన కుంటు పడకూడదని అనంతపురం డీఈఓ ఆఫీస్‌లో ఏడి-1గా పని చేస్తున్న నాగరాజుకు డిఇఓ (ఎఫ్ఎసి) బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్‌ఉత్తర్వులుజారీ చేశారు.

# నారా లోకేష్, చంద్రబాబు, అచ్చంనాయుడుపై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తునన వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ షాషావలి

**అనంతపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త బ్యూరో**

వైఎస్ఆర్‌సిపి శ్రీ సత్యసాయి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ షాషావలి అనంతపురం రూరల్ పోలీసులకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేస్,జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులుఅచ్చంనాయుడుపై రూరల్ స్టేషన్ సిఐ జి.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ షాషావలి మాట్లాడుతూ.. టీడీపీ పార్టీలో పదవులు పొందాలి అంటే అధిక కేసులు ఉండాలని నాయకులను కార్యకర్తలను రెచ్చగొడుతూ అ దే విధంగా శాంత్రి భద్రతలకు విఘాతం కలిగించిన విధంగా ఆయన ప్రసంగాలను చేస్తున్నాడు. అదే విధంగా నారా చంద్రబాబునాయుడు కూడా బహిరంగ సభలలో పార్టీ నాయకుల్ని కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం అనేది దారుణమైన విషయమని వీరిచ్చిన స్ఫూర్తితో తంబళ్లపల్లి, పుంగనూరు మాచర్ల లాంటి సున్నితమైన నియోజకవర్గాల్లో అల్లర్లు జరగటం ఒకరి మీద ఒకరు కేసులు పెట్టుకోవడం రాష్ట్ర ప్రజలందరూ చూస్తూనే ఉన్నారు. ఇటువంటి వారి మీద కఠినమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల అనేక గొడవలకి దారితీస్తుందని కావున పోలీసు శాఖ వారు ఇలాంటి వ్యాఖ్యలుచేసే వారిపై చర్యలు తీసుకుంటే శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉంటుందని తక్షణమే వారి మీద చర్యలు తీసుకుని మరల ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ చంద్రశేఖర్, రూరల్ మండలం జెసిఎస్ ఇన్‌చార్జ్ శ్యాం సుందర్ శాస్త్రి, రామగిరి మండలకన్వీనర్ రమేష్,నాయకులుధనుంజయయాదవ్, పేరూరు, మోహన్, రూరల్ మండల కో కన్వీనర్లు ఇర్ఫాన్, మనోజ్ పాల్గొన్నారు.

# ఆర్‌జెఎఫ్ జిల్లా అధ్యక్షునిగా బడిగి మంజునాథ్

- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎంపిక
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన కమిటీ



ఆర్‌జెఎఫ్ జిల్లా అధ్యక్షులు బడిగి మంజునాథ్

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 25 ప్రభాతవార్త**

ఆర్జెఎఫ్ (రాయలసీమ జర్నలిస్టుల ఫోరం) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు శు క్రవారం ఆర్జెఎఫ్ కార్యాలయంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఆర్జెఎఫ్ అధ్యక్షులు కుంచెం ప్రభాకర్‌రెడ్డి (న్యూస్9టివి) ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ(సూర్య), గౌరవాధ్యక్షులు నాగరాజు (సుమన్‌టివి), ఉపాధ్యక్షులుగా గాజుల నాగభూషణం (మాపటేల డెలీ) ఆ వివరాలనందించారు. సాక్షి దినపత్రికలో పని చేస్తున్న బడిగి, మంజునాథ్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయన గత 16 ఏళ్లుగా వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా, బ్యూరో ఇన్‌చార్జ్‌గా పని చేయడమే కాకుండా జర్నలిస్టు సంఘాల్లోనూ కీలకంగా పని చేశారు. వివిధ సంఘాలలో పలు హోదాల్లో ఉంటూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా సాక్షి ఛానెల్‌లో పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, గుత్తి సాక్షి దినపత్రికలో పని చేస్తున్న గోవిందరాజులు, సహాయ కార్యదర్శిలుగా సుధీర్ సుమన్ టివి, సురేష్ 4 న్యూస్, మధుసూధన్‌రెడ్డి ఆంధ్రప్రభ, మంజు న్యూస్ 9 టివి) ఈసీ3 మెంబర్లుగా వెంకటేష్, వంశీ రహంతుల్లా, మురళీ, గోగుల ఆంజినేయులు తదితరులు నూతన కమిటీలో ఉన్నారు. ఈ సందర్భంగా కోర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆర్‌జెఎఫ్ పని చేస్తుందని ఆ నేపథ్యంలో ఎంపిక చేసిన నూతన కమిటీ సభ్యులు త్వరలో ప్రమాణ స్వీకారం చేస్తారని తెలపారు.

# ఆయకట్టు వెలవెల.. అన్నదాతలు విలవిల

- హెచ్‌ఎల్‌సి దుస్థితిపై కాలవ ఆందోళన



ఎస్ఈతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

**అనంతపురం అర్బన్, ఆగస్టు 25 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాకు ప్రాణాధారమైన తుంగభద్ర ఎగువ కాలువకు అత్యవసర మరమ్మత్తుల విషయంలో ప్రభుత్వం అంతులేని అశ్రద్ధ చూపుతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మండి పడ్డారు. హెచ్ఎల్‌సి దుస్థితిపై శుక్రవారం సాయం త్రం అనంతపురంలో ఎస్.ఇ.రాజశేఖర్‌ను కలసి వివరించారు. కాలువకు నీటి సరఫరా మొదలై నెలన్నర కావస్తున్నా సగం ఆయకట్టులో కూడా నాట్లు పడలేదని కాలవ తెలిపారు. బలహీనమైన గట్లు, రంధ్రాలు పడ్డ అండర్ టన్నెళ్లు రైతులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. గడిచిన నాలుగేళ్లుగా కనీస రిపేర్లకు నోచుకోని హెచ్ఎల్‌సి ప్రమాదకరంగాతయారైందన్నారు. ఆధునికీకరణ పనులు అర్థాంతరంగా ఆగిపోవడం,మిగిలిపో యిన వాటికి రీ టెండర్లు పిలిచి పనులు ప్రారం భించకపోవడం లాటి కారణాలతో ప్రధాన కాలువ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోందని ఆందోళన వెలిబుచ్చారు. పంట కాలువల దుస్థితి వర్ణణాతీతమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కొన్ని డిస్ట్రిబ్యూటరీల ఆధునీకరణ పనులు పూర్తి చేశామని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది ఆరంభం నుంచి నెలకొన్న వర్షాభావం వల్ల టిబి డ్యాంకు సకాలంలో నీరు చేరని కారణంగా తుంఘభద్ర ఎగువ కాలవకు నీటి విడుదల ఆలస్యమైందన్నారు. గత నెల 19న రాష్ట్ర సరిహద్దులో హెచ్ఎల్‌సికి నీరు చేరిదన్నారు. సాధారణంగా ఆగస్టు తొలి వారంలోపే నీరు పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించి ఆయా కాలువలకు నీటి విడుదల తేదిలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే ఆగస్టు ముగుస్తున్నా జిల్లా ఐఎబి సమావేశాన్ని నిర్వహించకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు. సమావేశ తేదీని ఇప్పటిదాకా ఖరారు కూడా చేయకపోవడం రైతులపట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. ముఖ్యంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కనీసం ఆయకట్టు గ్రామాల్లో పర్యటించి రైతుల బాధలు తెలుసుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యేలు, అధికారులు తమ వైపు తిరిగి చూడకపోవడంతో సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో దిక్కుతోచని దయనీయ పరిస్థితిలో హెచ్ఎల్‌సి ఆయకట్టుదారులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పటికైనా ఐఎబి సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి ఆయకట్టుకు కావాల్సినంత నీరు విడుదలయ్యేలా చూడాలని ఎస్ఇని కోరారు.

# పరిశ్రమల స్థాపనకు పుట్టపర్తి అనువైన ప్రదేశం

- అఖిలభారత ఆర్యవైశ్య పారిశ్రామిక వేత్తల సమావేశంలో సూర్యచంద్రారెడ్డి పిలుపు
- పుట్టపర్తిని సందర్శించిన 71 మందిపారిశ్రామిక వేత్తలు





పుట్టపర్తి ప్రాధాన్యత గురించి పారిశ్రామిక వేత్తలకు ప్రజెంటేషన్ ఇస్తున్న సూర్యచంద్రారెడ్డి , పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కార్యాలయం వద్ద పారిశ్రామిక వేత్తల బృంద చిత్రం

**పుట్టపర్తి, ఆగస్టు 26, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా పరిశ్రమల స్థాపనకు పుట్టపర్తి అనువైన ప్రదేశమని మనభూమి ఫౌండేషన్, అమెరికా తెలుగు అసోసియేషన్ ఇండియా కో ఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆల్‌ఇండియా ఆర్యవైశ్య పారిశ్రామిక వేత్తల సంఘం అధ్యక్షులు రాచూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 71 మంది పారిశ్రామిక వేత్తల బృందం పర్యటించింది. తొలుత వారు ప్రశాంతి నిలయంలోని బాబా మహాసమాధిని దర్శించుకొని పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమె ్మల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆయన సోదరుడు దుద్దుకుంట కేశవ రెడ్డిలను కలిశారు. అక్కడ ఎమ్మెల్యే వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. ముందుగా పారిశ్రామిక వేత్తలకు కేశవరెడ్డి పుట్టపర్తి ప్రాధాన్యత, సత్యసాయి జిల్లాలో ఉన్న వనరులను గురించి వివరించారు. జిల్లా ఏర్పాటు, పుట్టపర్తి మీదుగా హైవేకనెక్టివిటి, రోడ్లు, నీటి వనరుల సాధనకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చేసిన కృషిని వివరించారు. అనంతరం గంగాపల్లి సూర్యచంద్రారెడ్డి మాట్లాడుతూ, పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఆవిర్భావం కావడం, ఇక్కడికి సమీపంలో కియా పరిశ్రమ ఉండడం, 100 కిలోమీటర్లలోపు బెంగుళూరు జాతీయయ పారిశ్రామిక మహానగరం ఉండడం ఇక్కడి నుండి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం ప్రారంభం అవడం విరివిగా ప్రభుత్వ భూములు లభించడం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాల అనువైన అన్ని పరిస్థితులు కల్పించడం ఎంతో శుభపరిణామమన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని అఖిలభారత పారిశ్రామిక వేత్తల సంఘం సభ్యులు తమ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పాలని విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాంతంలో సోలార్ విద్యుత్,పవన విద్యుత్, విరివిగా లభిస్తుందని, హంద్రీనివా సుజల స్రవంతి ద్వారా నీటి లభ్యత విధిగా ప్రభుత్వ భూములు పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వారికి పూర్తి సహాయసహకారాలు అందిస్తారని సూర్యచంద్రారెడ్డి తెలియజేశారు. దీనిపై పారిశ్రామిక వేత్తల బృందం ఈ విషయాలను తప్పక పరిశీలించి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తామని తెలియడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ ఓడిసి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి విషయంలో దేశ రాజకీయం చేయెుద్దు

- బళ్లారిలో కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు..... వర్చువల్ ద్వారా గాలి జనార్ధన్‌రెడ్డి ప్రసంగం





వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి. కేఆర్‌పీపీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక వివాహాల్లో దంపతులైన నూతన వధూవరులు

**బళ్లారి, ఆగస్టు25, ప్రభాతవార్త ;**

కళ్యాణరాజ్య ప్రగతిపక్ష (కేఆర్‌పీపీ) పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని హవంబావిలో ఉచిత సామూహిక వివాహాలు శుక్రవారంనాడు జరిగాయి. శ్రీ వరమహాలక్ష్మి పూజ పర్వదినం పురస్కరించుకుని కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలను శ్రీ కళ్యాణస్వామిజీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కేఆర్‌పీపీ స్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి వర్చువల్ ద్వారా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో మాట్లాడిన ఆయన తాను మంత్రిగా ఉన్న సమ యంలో బళ్లారి అభివృద్ధి విషయంలో రాజకీయం చేయలేదని, అభివృద్ధి విషయానికొస్తే ద్వేషపూరిత రాజకీయం చేసేవాళ్లు ఉన్నంతవరకు ఆ పార్టీలకు నష్టమే ఉంటుందని చెప్పారు. గతంలో నా వెంట ఉండి విడిచి పెట్టిన వారు ఈసారి జరిగిన విధానసభ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయి ఇంట్లో కూర్చొన్నారని చెప్పారు. జరిగిన విధాన సభ ఎన్నికల్లో తన సతీమణి గాలి లక్ష్మిఅరుణ బళ్లారి నగర ప్రజలతో మమేకమయ్యారు. అయితే మాకు సంబంధించిన వారు కొందరు శత్రువులతో చేతులు కలిపి లక్ష్మిఅరుణను ఓడిపోయేలా చేశారు. దీనికి ఫలితంగా వారు కూడా ఇంట్లో కూర్చొన్నారని పరోక్షంగా తన ఆప్తుల గురించి ఎద్దేవా చేశారు. తనను నమ్మిన కార్యకర్తలెవరైనా సరే వారిని నేను విడిచిపెట్టనని తెలిపిన గాలి జనార్ధన్‌రెడ్డి తన భార్య గాలి లక్ష్మిఅరుణ జరిగిన ఎన్నికల్లో కిత్తూరు రాణిచెన్నమ్మ మాదిరిగా పోరాటం జరిపారు. అయితే తమకు సంబంధించిన వారి కుయుక్తుల కారణంగా లక్ష్మిఅరుణ ఓటమి చెందారని, అయినా ఆమె ప్రజలపరంగా బళ్లారిలో ముున్ముందు పోరాటం జరుపుతారని పేర్కొన్నారు. కేఆర్‌పీపీ పార్టీలోకి వలస వెళ్లి ఉన్న వారికి ఎటువంటి పనులు చేసిపెట్టకూడదని స్థానిక ఎమ్మెల్యే చెబుతుండడం హాస్యాస్పదమని, ఎన్నికలు ముగిశాక రాజకీయం చేయకూడదని, తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరినీ విశ్వాసంగా తీసుకున్నానని చెప్పారు. ఇటీవల జరిగిన విధానసభ సమావేశాల్లో చర్చలో పాల్గొని బళ్లారి ఎయిర్‌పోర్టు అంశంపై మాట్లాడి నట్లు మంత్రి ఎం.బి.పాటిల్ ఉత్తమరీతిలో స్పందించారని తెలిపిన జనార్ధన్‌రెడ్డి, బళ్లారి విమానాశ్రయ నిర్మాణం, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పెండింగ్ నిర్మాణ పనులు, బళ్లారి-హంపీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులను బళ్లారికి చెందిన ఆ ఎమ్మెల్యేలు, మంత్రులు దృష్టి సారించాలని, ప్రజలు తనను తాను చేసిన అభివృద్ధిని మరిచిపోయేవిధంగా పనులు చేయాలని చెప్పారు. బళ్లారిలో గెలిచిన ఏ ఎమ్మెల్యే, మంత్రి తమ పార్టీ కార్యకర్తలకు ఇబ్బంది కలిగిస్తే తాను ఊరుకునేదిలేదని, కేవలం 70 కి.మీ. దూరంలో గంగావతి ఎమ్మెల్యేగా ఉన్నట్లు చెప్పారు. విధానసౌధ బయట, లోపల పోరాటం జరుపుతానని తెలిపిన రెడ్డి తన కార్యకర్తల రక్షణకు కట్టుబడి ఉంటానని చెప్పారు. గతంలో 1999లో జరిగిన లోకసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సుష్మాస్వరాజ్ పరాజయం చెందారు. అయితే బళ్లారి ప్రజల అభిమాన చూసి ఆమె ప్రతి సంవత్సరం బళ్లారికి వరమహాలక్ష్మి పండగకు వస్తానని చెప్పారు. ఆమె వచ్చిన సందర్భంలో మంచి శుభకార్యం జరపాలన్న ఉద్దేశ్యంతో సామూహిక వివాహాలు ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తూ వచ్చినట్లు, అయితే రాజకీయ కుతంత్ర ంతో తనను బళ్లారి నుంచి దూరం పెట్టారని చెప్పారు. నూతన వధూవరులకు గాలి జనార్ధన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాలి లక్ష్మిఅరుణ నూతన వధూవరులకు ఆశీస్సులు తెలిపి సంసార జీవనంలో సుఖంగా జీవించాలని ఆశీర్వదించారు. 12 సంవత్సరాలుగా సామూహిక వివాహాలు, గాలి జనార్ధన్‌రెడ్డికి జరిగిన కుతంత్రం వల్ల నిలిచిపోయాయని, తిరిగి తమ కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో ఈ వివాహాలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ సందర్భంలో కేఆర్‌పీపీ నాయకులు గోనాళ్ రాజశేఖర్‌గౌడ, కె.ఎస్.దివాకర్, పాలికె సభ్యులు కోనంకి తిలక్‌కుమార్, కల్పన, పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మున్నాభాయ్, మాజీ మేయర్ వెంకటరమణ, హంపీరమణ, శివారెడ్డి, సంజీవ్‌బెడగేరి, మెహపూజ్ ఆలీఖాన్ తదితరులు వేదికపై పాల్గొన్నారు.

# సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు సమ్మెబాట

**బుక్కరాయసముద్రం ఆగష్టు 25 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా శ్రీ సత్యసాయి వాటర్ సప్లై కార్మికులకు గత 5 నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదు జీతాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుచున్నామని ట్రేడ్.ఈ విషయం పై అనేక సార్లు జిల్లా కలెక్టర్‌ను కలసి మెరపెట్టుకున్నాం,వారితోపాటు బోర్డు మెంబర్‌ను సంప్రదించిన ఫలితంలేదు చివరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి ని కూడ కలసి మా భాదలు విన్నవించుకున్నా మా సమస్యకు పరిష్కారం కాలేదు.

# ముందస్తు అరెస్టులు తగదు

- ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బోయ గోపాల్
- సిపిఐ తాలుకా కార్యదర్శి జే.మల్లికార్జున



నిరసన తెలుపుతున్న దృశ్యం

**కూడేరు,ఆగస్టు 25,ప్రభాతవార్త:**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ గుంతకల్లు పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జగనన్న కాలనీల పేరు మీదుగా ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణం తక్షణమే అమలు పరచాలని న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సిపిఐ జగదీష్ నాయకత్వంలో గురువారం డిమాండ్ల పరిష్కారం కోరకు మీటింగ్ చేపట్టడానికి పోలీసు వారు పర్మిషన్ ఇవ్వకుండా 144 సెక్షన్ పెట్టారు.ఈ కార్యక్రమానికి వస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌ను కూడా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఇది ఏ మాత్రం తగదని సిపిఐ తాలుకా కార్యదర్శి జె.మల్లికార్జున డిమాండ్ చేశారు.శుక్రవారం వీరి అరెస్టులకు నిరసనగా కూడేరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ,వ్యవసాయ కార్మిర సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ,మండల సీనాయర్ నాయకులు ముటాంటల శ్రీరాములు,మల్లరాయుడు,కాసిం వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ నమోదు కేంద్రం ను పరిశీలించిన ఎంపిడిఓ



ఆధార్ కేంద్రన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ విజయభాస్కర్

**బుక్కరాయసముద్రం ఆగష్టు 25 ప్రభాతవార్త**

మండల పరిదిలోని రేకులకుంట గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు మొబైల్ కేంద్రంను శుక్రవారం ఎంపిడిఓ విజయభాస్కర్ పరిశీలించారు.అనంతరం సిటిజన్ ఔట్రీచ్‌ప్రోగ్రాం,పాలవెల్లువ సర్వేను పరిశీలించి వాలంటీర్ల ద్వారా వారికి సంబందించిన ఇండ్ల యజమానులకు వారికుటుంబ సభ్యలకు ఆధార్ నమోదు కేంద్రం గురించి వివరించి ఎక్కువ సంఖ్యలో మొబైల్ నంబర్లు అప్డేట్,ఇంటి పేరుమార్పు ఇంటి అడ్రస్ మార్పు ఎక్కువ సంఖ్యలో ఆధార్ సేవలు ఉపయోగించుకోవాలని తెలియజేశారు.

# రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోండి

-పోలీసులకు ఫిర్యాదు చేసిన వైసీపీ సోషల్ మీడియా నేతలు



నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని సిఐకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ సోషల్ మీడియా నేతలు

**అనంతపురం సిటీ, ఆగస్టు 25 ప్రభాతవార్త**

రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న టీడీపీ నేతలు కార్యకర్తలను నారా లోకేష్ రెచ్చగొడుతు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ప్రధానంగా పార్టీ కార్యకర్తఉల, నేతలపై ఎన్ని ఎక్కువ కేసులు ఉంటే వారికే టిడిపిలో ప్రాధాన్యత కల్పిస్తామంటూ నారా లోకేష్ రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్ల రాష్ట్రంలో హింసకు దారితీసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా అధ్యక్షులు నరేంద్రనాథ్‌రెడ్డి, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గోళ్ల శ్రావణరెడ్డిలు నగరంలోని 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ శివరాముడుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఐటి విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి ముకుందాపురం ప్రతాప్‌రెడ్డి, ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లాకో కన్వీనర్ నాని, ప్రతినిధులు సాయి ప్రవల్లిక, రాజు, జీలాన్, ప్రసాద్, నరేష్, నరసింహా, హరి, రమేష్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఈపీ రద్దు చేయకూడదంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిఘటన

**బళ్లారి, ఆగస్టు25, ప్రభాతవార్త ;**



బళ్లారిలో ప్రతిఘటన జరుపుతున్న ఏబీవీపీ కార్యకర్తలు

జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ) రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ వందలాది మంది ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు జిల్లాధికారి కార్యాలయంలో ప్రతిఘటన చేపట్టారు. ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వతంత్ర్యభారత దేశంలో విద్యా పద్ధతి, బ్రిటీష్ హయాం నుంచి కొనసాగుతూ వస్తున్నదని, పురాతన విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసిన కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం (ఎన్ఈపీ) రూపొందించడం ప్రశంసనీయమని తెలిపారు. దేశంలో కర్ణాటకలోనే 2020-2021లో మొదటిసారిగా ఎన్ఈపీ జారీలోకి తీసుకురావడం జరిగింది. ఇది మనకెంతో గర్వనీయమని, ఇటువంటి నూతన విద్యావిధానాన్ని జారీలోకి తెస్తున్న దశలోనే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం విద్యా వ్యతిరేకమని, రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. ఎన్ఈపీ రద్దు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నుంచి తీవ్ర పోరాటం ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్ఈపీ రద్దు చర్యను తక్షణమే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని జిల్లాధికారి కార్యాలయం అధికారికి అందజేశారు. ఈ సందర్భంలో ఏబీవీపీ నాయకులు వినోద్‌కుమార్, నాగరాజు, హర్షనాయక్, నవీన్, బసవ, ఇంద్రారెడ్డి, శ్రీకాంత్, ఐశ్వర్య, పూర్ణిమ, రంజిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

26-8Pg10exHNWMJQE:Layout 1 01/01/01 7:39 AM Page 1



# ఆముగ్గురు క్రికెటర్లపై ముంబయి ఫోకస్



**ముంబయి:** ఐపిఎల్ 2024 సీజన్‌కోసంముంబయి ఇండియన్స్ ఇప్పటినుంచే కసరత్తులు ప్రారంభించింది. టీమ్‌ప్రక్షాళన ప్రారంభించిన ముంబయి మేనేజ్‌మెంట్ డిసెంబరులో జరిగే మినీ వేలంకోసం తమ ప్లాన్ సిద్ధంచేసింది. పేస్‌బౌలింగ్‌కోచ్‌గా లసిత్‌మలింగాను నియమించుకున్న ముంబయి ఇండియన్స్ విడుదలచేసే ఆటగాళ్ల జాబితాను రెడీచేసింది. ఐపిఎల్ 2023లో ప్లేఆఫ్స్‌చేరిన ముంబయి ఇండియన్స్ క్వాలిఫయర్2లో ఓడి తృటిలో టైటిల్ వదులుకుంది. బౌలింగ్ బలహీనంగా ఉండటం ఆజట్టుకొంప ముంచింది. వెటరన్ స్పిన్నర్ పియూష్ చావ్లాతోపాటు యువ స్పిన్నర్ హృతిక్‌షోకీన్, అర్షద్‌ఖాన్, క్రిస్ జోర్డాన్‌లను వదులుకుంటున్నది. భారీ ధరకు కొనుగోలుచేసిన జోఫ్రా ఆర్చర్ రాణించకపోవడంతో ఆతడిని కూడా వదిలేయాలనిచూస్తోంది. బుమ్రా రీ ఎంట్రీతో ఆర్చర్‌ను వదిలేస్తోంది. స్పిన్ విభాగం పటిష్టంకోసం రవిబిష్ణోయ్‌ని ఎంపియచేస్తోంది. ఆతనితోపాటు క్రిస్‌వోక్స్, హర్షల్‌పటేల్‌లకోసం ముంబయి ఇప్పటినుంచే ప్రయత్నాలు ప్రారంభించింది. లక్నో జట్టుకు ఆడుతున్న బిష్ణోయ్ ఆజట్టును వీడాలని చూస్తున్నాడు. ట్రేడింగ్ విండోలో ఆతడిని రాబట్టాలని ముంబయి చూస్తోంది. యాషెస్‌లో సత్తాచూపించిన క్రిస్‌వోక్స్‌పైకూడా ముంబయి యాజమాన్యం ఫోకస్ పెంచింది. ఆతడిని తీసుకుంటే పేస్‌తోపాటు బ్యాటింగ్‌కూడా పెరుగుతుందని అంచనావేసింది. కీరన్‌పొలార్డ్‌కు ఇతడే ప్రత్యామ్నాయం అని చూస్తోంది. యాషెస్‌సిరీస్‌లో క్రిస్‌వోక్స్ 19 వికెట్లతో సత్తా చాటాడు. 21 ఐపిఎల్‌మ్యాచ్‌లు ఆడినక్రిస్‌వోక్స్ 30 వికెట్లుతీసాడు. ఇక ఆర్సీబీలో కీలకంగా ఉన్న హర్షల్‌పటేల్‌ను తీసుకునేందుకు చూస్తోంది. 14 మ్యాచ్‌ల్లో 13 వికెట్లుతీసిన పటేల్‌ను ఆర్సీబీ వదిలేస్తే ముంబయి తీసుకోవాలనిచూస్తోంది.



## ఫైనల్‌కు దూసుకువెళ్లిన బల్లెం వీరుడు నీరజ్ చోప్రా

**హాంగేరి:** ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్వాలిఫయర్స్ తొలిప్రయత్నంలోనే భారత బల్లెం వీరుడు ఒలింపిక్ గోల్డ్‌మెడలిస్ట్ నీరజ్‌చోప్రా సంచలన ప్రదర్శనచేసాడు. క్వాలిఫయింగ్‌గ్రూప్ ఏ లో పోటీపడిన నీరజ్ జావెలిన్‌ను 88.77 మీటర్లు దూరం విసిరి ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఫైనల్ కటాఫ్ మార్క్ 83 మీటర్లే. చోప్రా మరో 5.77 మీటర్లు ఎక్కువే విసిరి ఫైనల్‌కు చేరాడు. ఆదివారం జావెలిన్‌త్రో ఫైనల్‌పోటీలు జరుగుతాయి. ఈ ప్రదర్శనతో నీరజ్‌చోప్రా పారిస్ ఒలింపిక్స్ అర్హత సాధించాడు. భారత్‌కే చెందినమరో జావెలిన్‌ప్లేయర్ మను తొలిరౌండ్‌లో 78.10 మీటర్లు విసిరి రెండోప్రయత్నంలో 81.31 మీటర్లే విసిరాడు. మూడోప్రయత్నంలో 72.40 మీటర్లకే పరిమితం అయ్యాడు. గత ఏడాదిప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చోప్రా సిల్వర్‌మెడల్‌సాధించాడు. గత ఏడాది 88.13 మిటర్ల దూరం విసిరిన చోప్రా రెండోస్థానంలో వచ్చాడు. గ్రెనెడాకు చెందిన ఆండర్సన్‌పీటర్స్ 90.54 మీటర్లు విసిరి స్వర్ణపతకం సాధించాడు. టోక్యోవేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో నీరజ్ స్వర్ణం సాధించి గోల్డెన్‌బాయ్‌గా నిలిచాడు. 2018 ఆసియాక్రీడల్లో స్వర్ణం, 20198లో కామన్వెల్త్‌గేమ్స్ స్వర్ణంతోపాటు 2022లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో రజతపతకాలుసాధించాడు.

## యోయో రిజల్ట్‌పై కోహ్లీపట్ల బిసిసిఐ సీరియస్



**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీపై బిసిసిఐ సీరియస్ అయింది. యోయో టెస్ట్ వివరాలను సోషల్‌మీడియాలో పోస్టుచేయడం సరికాదని హెచ్చరించింది. ఆటగాళ్లకు స్వీట్ వార్నింగ్ ఇచ్చినట్లు బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. ఆసియాకప్ 2023 ప్రిపరేషన్‌లో భాగంగా జట్టులోకి ఎంపికైనవారికోసం బిసిసిఐ యోయోటెస్టు నిర్వహించింది. తప్పనిసరికాక పోయినా ప్రతి ఒక్కరూ హాజరుకావాలని సూచించడంతో కోహ్లీ సహా పలువురు ఆటగాళ్లకు యోయోటెస్టు ముగిసింది. ఇక కోహ్లీ తన టెస్టు స్కోరును సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. యోయో టెస్టులో 17.2 స్కోరు వచ్చినట్లు తెలిపాడు. బిసిసిఐ కనీస స్కోరు 16.5. విరాట్ కోహ్లీ చేరుకున్నప్పటికీ కొందరు ఆమార్కు దాటలేదని ప్రచారం వచ్చింది. దీనితో బిసిసిఐ ఆటగాళ్లు ఎవరూ యోయో టెస్టు ఫలితాలు సోషల్‌మీడియాలో పోస్టుచేయవద్దని సూచించింది. శిక్షణ సందర్భంగా దిగిన ఫోటోలు కొందరు తమ ఫ్యాన్స్‌తో పంచుకుంటున్నారు. అలాగే టెస్టుల స్కోరుకు సంబంధించిన విషాలు కూడా పంచుకుంటున్నారు.

ఇది బిసిసిఐ కాంట్రాక్టు నిబంధనల ధిక్కారం కిందకే వస్తుందని బిసిసిఐ చెపుతోంది. ఇలాంటివి ఇకపై చేయవద్దని మౌఖిక ఆదేశాలిచ్చామని బిసిసిఐ ప్రతినిధి చెప్పారు. ఆసియాకప్ ఆగస్టు 30నుంచి ప్రారంభం కానుండగా టీమిండియా తమ తొలిమ్యాచ్‌ను సెప్టెంబరు రెండున పాకిస్థాన్‌తో ఆడనుంది. బెంగళూరు వేదికగా టీమిండియా ప్రాక్టీస్ క్యాంప్‌ప్రారంభించింది. రాహుల్‌ద్రవిడ్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈప్రాక్టీస్ శిబిరానికి కోహ్లీకూడా వచ్చాడు.



## బాబర్ ఆజమ్ అరుదైన రికార్డు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ జట్టు కెప్టెన్ బాబర్ ఆజమ్ ప్రపంచ రికార్డుసాధించాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన రెండో వన్డేలో 53 పరుగులుచేసి అర్థసెంచరీచేసిన బాబర్ ఆజమ్ అంతర్జాతీయ వన్డేల్లో 100 ఇన్నింగ్స్‌ల తర్వాత అత్యధికపరుగులుచేసిన క్రికెటర్‌గా రికార్డుసాధించాడు. ఆఫ్ఘన్‌తో రెండో వన్డే బాబర్ ఆజమ్‌కు 100వ ఇన్నింగ్స్.ఇప్పటివరకూ ఆజమ్ 100 వన్డే ఇన్నింగ్స్‌లో 5142 పరుగులుచేసాడు. ఇప్పటివరకూ ఈ రికార్డు దక్షిణాఫ్రికా దిగ్గజం హాసీం ఆమ్లాపేరిట ఉండేది. ఆతడు 100వ వన్డే ఇన్నింగ్స్‌ల్లో 4946 పరుగులుచేసాడు. తాజాగా బాబర్ ఆజామ్ ఈ ఘనతను అధిగమించాడు. ఈ జాబితాలో బాబర్ ఆజమ్ ఆమ్లా తర్వాత వివ్ రాచర్డ్స్ 4607 పరుగులతోను, షైహోప్ 4436 పకరుగులతోను, జోరూట్ 4428 పరుగులతో కొనసాగుతున్నారు. టీమిండియా కెప్టెన్ విరాట్‌కోహ్లీ 100 ఇన్నింగ్స్‌లో 4230 పరుగులుచేసాడు. ఈజాబితాలో కోహ్లీ తొమ్మిదోస్థానంలో ఉన్నాడు. ఆఫ్ఘన్‌తో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ ఒక్క వికెట్ తేడాతో గెలిచింది. ఈ విజయంతో పాకిస్థాన్ 2-0తో మరోమ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసంచేసుకుంది. బాబర్ తన వన్డే కెరీర్‌లో ఇప్పటివరకూ 18 సెంచరీలు, 27 అర్థసెంచరీలు చేసాడు.

## యువీ కుటుంబంలోకి లిటిల్‌ప్రిన్సెస్!



**ముంబయి:** టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ 2011 వన్డే వరల్డ్‌కప్ హీరో యువరాజ్‌సింగ్‌మరోసారి తండ్రి అయ్యాడు. యువరాజ్ భార్య హేజెల్‌కీచ్ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. యువరాజ్ ఈ వార్తను సోషల్‌మీడియాలో ప్రకటించాడు. మాలిటిల్‌ప్రిన్సెస్ ఆరాకు వెల్‌కమ్. ఆమెరాకతో మాకుటుంబం పరిపూర్ణం అయింది. నిద్రలేని రాత్రులు చాలా ఆనందకరంగా మారాయని యువీ ఎక్స్ వేదికగా పోస్టు చేసాడు. యువరాజ్‌సింగ్, మోడల్ హేజెల్‌కీచ్ 2016లో వివాహంచేసుకున్నారు. ఈ వేడుకలకు విరాట్‌కోహ్లీ, పుజారా, కరుణ్‌నాయర్‌సహా పలువురు భారత క్రికెటర్లు హాజరయ్యారు. యువరాజ్ కపుల్ పెళ్లయిన ఆరేళ్లకు అంటే 2022లో తొలిసారి తల్లితండ్రులుగా పదోన్నతి పొందారు. హేజెల్ లీచ్ 2022 జనవరిలో మగబిడ్డకు జన్మనిచింది. తాజాగా మరోసారి ఆడబిడ్డను ప్రసవించింది. 2007 టి20 వరల్డ్‌కప్, 2011లో వన్డే వరల్డ్‌కప్ గెలిచినజట్టులో సభ్యుడుగా ఉన్న 41 ఏళ్ల యువరాజ్‌సింగ్ 2019లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2007 టి20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్ బౌలర్ స్టువర్ట్‌బ్రాడ్‌పై ఒక ఓవర్‌లో ఆరుబంతుల్లో యువీ ఆరుసిక్స్‌లు బాదాడు. వన్డే వరల్డ్‌కప్‌లో కూడా తన ఆల్‌రౌడ్ ప్రదర్శనతో అదరగొట్టాడు.

## రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ సూపర్‌స్టార్ బ్రేవాట్ హఠాన్మరణం



**వాషింగ్టన్:** ప్రపంచ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ మాజీ ఛాంపియన్ డబ్ల్యుడబ్ల్యుఈ సూపర్‌స్టార్ బ్రేవ్యాట్ హఠాన్మరణం చెందారు. గుండెపోటు రావడంతోబ్రేవాట్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. 36 ఏళ్ల బ్రేవాట్ కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో సతమతం అవుతున్నాడు. అనారోగ్యం కారణంగా చాలా రోజులు రింగ్‌లో కూడా కనిపించడంలేదు. వ్యాట్‌మృతితో డబ్ల్యుడబ్ల్యుఈ రంగంలో తీవ్ర విషాదంచోటుచేసుకుంది. ఈ విభాగం చీఫ్ కంటెంట్ అధికారి పాల్‌మైకెల్ లెవెస్కీ అధికారికంగాప్రకటించారు. బ్రేవాట్ అసలుపేరు విండామ్ రోటుండా. మావిభాగం అప్పుడు కుటుంబ సభ్యుడు విండామ్ రోటుండా మరణించారనే సమాచారం అందిందని, బ్రేవ్యాట్‌మరణ వార్త విన్న ఒక్కసారిగా షాక్‌కు గురయినట్లు తెలిపారు. చీఫ్ కంటెంట్ అధికారి ట్రిపుల్‌హోచ్ మాట్లాడుతూ బ్రేవాట్‌చివరిసారిగా ఈఏడాది జనవరిలోజరిగిన రాయల్ రంబుల్‌రెజ్లింగ్ ఈవెంట్‌లోపాల్గొన్నాడు. 2009లో మొదలయిన బ్రేవాట్ రెజ్లింగ్‌ప్రయాణం 2023తో ముగిసింది. ఈ 14 ఏళ్ల రెజ్లింగ్‌కెరీర్‌లో బ్రేవాట్ ఒకసారి ఛాంపియన్‌షిప్, రెండుసార్లు యూనివర్సల్ ఛాంపియన్‌షిప్ టైటిల్స్ సాధించాడు. ప్రముఖ రెజ్లర్ అండర్‌టేకర్ వచ్చేటపుడు లైట్లన్నీ ఎలా ఆపేసేవారో బ్రేవాట్ వచ్చే సమయంలోకూడా నిర్వాహకులు అదేచేసేవారు. అప్పుడు బ్రేవాట్ లాంతరుపట్టుకుని ఎంట్రీ ఇచ్చేవాడు. రెజ్లింగ్‌లో ఆతడు చేసే విన్యాసాలు ఫ్యాన్స్‌ను ఆకట్టుకునేవి.

## భారత్‌లో జార్జిసోరస్ మద్దతుతో ఒసిసిఆర్‌పి దృష్టి!

**వాషింగ్టన్, ఆగస్టు 25:** అదానీ గ్రూప్ తన షేర్లలో అవకతవకలకు పాల్పడు తోందని అమెరికాకు చెందిన పెట్టుబడుల పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక భారతీయ స్టాక్ మార్కెట్లను కుదిపేసిన విషయం విదితమే. చాలా కాలంగా ఇది చర్చనీయాంశంగా మారింది. తాజాగా హిండెన్‌బర్గ్ తరహా మరోసంస్థ భారత కార్పొరేట్ల ఆర్థిక అవకతవకలపై త్వరలోనే నివేదిక విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ బిలియనీర్ జార్జ్ సోరోస్, రాక్‌ఫెల్లర్స్ బ్రదర్స్ వంటి దిగ్గజాల్లో నడుస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) ఈ నివేదికను విడుదల చేయనున్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. భారత కార్పొరేట్ కంపెనీల్లోనే విదేశీ పెట్టుబడులపై దృష్టిసారించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, అదానీ గ్రూప్ తమ కంపెనీల షేర్ల ధరల్ని కృత్రిమంగా పెంచిందని 2023 జనవరి 23న వెలువడిన నివేదికలో అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం విదితమే. దీంతో అదానీ గ్రూప్‌నకు చెందిన స్టాక్స్ పెద్ద ఎత్తున నష్ట పోయాయి. ఏకంగా 150 బిలియన్ డాలర్ల సంపదను అదానీ కోల్పోయింది. అయితే ఈ ఆరోపణలను అవాస్తమని అదానీ తోసిపుచ్చింది. 24 లాభాపేక్షలేని పరిశోధనాత్మక కేంద్రాలతో ఏర్పాటు చేసిన పరిశోధనాత్మక సంస్థగా ఈ ఒసిసిఆర్‌పి పేరు పొందింది. ఈ సంస్థ 2006లో ప్రారంభమైంది. జార్జ్ సోరోస్, ఓక్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్, రాకెఫెల్లర్ బ్రదర్స్ ఫండ్ సంస్థలు ఇందులో పెట్టుబడులు పెట్టాయి. ఇక ఈ సంస్థ వ్యవస్థీకృత నేరాలపై నివేదికలు అందిస్తుంది.



## పాలసీ రేట్లు పెంచాల్సి ఉంటుంది: ఆర్‌బిఐ గవర్నర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** రానున్న నెలల్లో ఆర్‌బిఐ కీలక పాలసీ రేట్లు పెరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆర్‌బిఐ గవర్నరే స్వయంగా తెలిపారు. ఇప్పటికే పెరిగిపోయిన పలు ధరలపై కమిటీ సమావేశం ముఖ్యాంశాలపై ఆయన మాట్లాడుతూ, 'విస్తృత ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ద్రవ్యోల్బణం అంచనాలను పెంచే ప్రమాదాలపై ఆహార ధరల షాక్‌ల రెండో రౌండ్ ప్రభావాన్ని ముందస్తుగా తొలగించ డానికి మనం సిద్ధంగా ఉండాలి. ఆగస్టు 8 నుంచి 10 మధ్య జరిగిన ఎంపిసి సమావేశంలో ఈ సంవత్సరం మూడవసారి కూడా రేట్లను యధతథంగా ఉంచేందుకు ద్రవ్య విధాన కమిటీ ఏకగ్రీవంగా ఓటు వేసింది' అన్నారు. అయితే పాలసీ రేటు యధాతథ కొనసాగింపుపై ఆర్‌బిఐ గవర్నర్ మాట్లాడుతూ, కూరగాయల ధరల స్వల్పకాలిక స్వభావాన్ని బట్టి, ప్రధాన ద్రవ్యోల్బణంపై ధరల మొదటి రౌండ్ ప్రభావాన్ని బట్టి ద్రవ్య విధానం ఉంటుందన్నారు. ప్రపంచ ఆర్థిక వాతావరణం అనిశ్చితంగా కొనసాగుతోందని, ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ద్రవ్యోల్బణం లక్ష్యం కంటే ఎక్కువగానే ఉందని చెప్పారు. వీటన్నింటి మధ్య, భారతదేశం స్థిరంగా నిలుస్తూ ప్రపంచంలో కొత్త గ్రోత్ ఇంజిన్‌గా ఎదుగుతోందని శక్తికాంతదాస్ పేర్కొన్నారు. ప్రస్తుత అధిక ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఇతర కమిటీ సభ్యులు కూడా అంగీకరించారు. ఈ ఆహార ధరల పరిణామాల వల్ల గృహాల ద్రవ్యోల్బణ భావనలు ప్రభావితమైనట్లు తమ సర్వేలు సూచిస్తున్నాయని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర పేర్కొన్నారు.



ఆహారధరల షాక్‌ల ప్రభావం రెండో రౌండ్‌లోనూ ఉంటే ఆర్‌బిఐ కీలక రేట్లను పెంచాల్సి ఉంటుందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ హింట్ ఇచ్చారు. ద్రవ్య విధాన

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఆగస్టు 25:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. చివరికి సెన్సెక్స్ 366 పాయింట్లు క్షీణించి 64,886.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 121 పాయింట్లను కోల్పోయి 19,265.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇదే సమయంలో నిఫ్టీ బ్యాంకు సూచి 265 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచి 318 పాయింట్ల మేర నష్టాన్ని చవిచూశాయి. కేపిటల్ గూడ్స్, ఎఫ్‌ఎంసిజి, పిఎస్‌యు బ్యాంకు, మెటల్, రియాల్టీ, పవర్ రంగాలు ఒక శాతం చొప్పున క్షీణించడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిసాయి. ఎన్‌ఎస్‌ఇలో జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫిన్ సర్వ్, ఏసియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, ఒఎన్‌జిసి, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ లైఫ్, ఐసిఐసిఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, టైటాన్ కంపెనీ, ఐషర్ మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. ఇదే క్రమంలో ఎల్‌అండ్‌టి, డాక్టర్ రెడ్డీస్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్, ఇండస్ ఇండ్ బ్యాంకు, పవర్ గ్రిడ్, ఐటిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా కన్జూమర్, టాటా మోటార్స్ ఎన్‌టిపిసి, హిండాల్కో, అల్ట్రాటెక్ సిమెంట్స్, సన్‌ఫార్మా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ, అపోలో హాస్పిటల్స్, ఎల్‌టిఐఎం కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిసాయి.



## భారత్‌కు వరంగా కృత్రిమ మేధ: టాటా సన్స్ చైర్మన్

**ముంబై, ఆగస్టు 25:** టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ బి20 సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భారతదేశ శ్రామికశక్తి ల్యాండ్‌స్కేప్‌లో మంచి ఫలితాలను అందిస్తుందని తెలిపారు. ఇది కొత్త నైపుణ్యాలను పెంచి ఉద్యోగులకు ఉన్నతస్థాయి పనులకు, ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుందని అన్నారు. భారత్ వంటి దేశంలో ఏఐ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలలో మరింత సమర్థవంతమైన, ఉత్పాదక శ్రామికశక్తికి దారితీసే కార్మికుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఏఐ ఒక ఉత్ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు. ఏఐ సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్న సంస్థలను మాత్రమే కాకుండా వాటిని అమలు చేస్తున్న సంస్థలను కూడా పరిశీలించవలసిన అవసరం ఉందని మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ అన్నారు. ఏఐ స్వీకరణ వల్ల కలిగే నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలని వాటాదారులను బ్రాడ్ స్మిత్ కోరారు. మూడు రోజుల పాటు జరగనున్న జి20 సమ్మిట్‌లో ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, విదేశాంగ మంత్రి



ఎస్.జైశంకర్, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో సహ ఉన్నతస్థాయి అతిథి జాబితాలో శుక్రవారం ప్రారంభమైంది. 2010లో స్థాపించబడిన జి20 సమ్మిట్ జి20 ఫ్రేమ్ వర్క్‌లోని అత్యంత ప్రభావవంతమైనదిగా ఎదిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలు, వ్యాపార సంస్థల నుంచి భాగస్వామ్యాన్ని ఆకర్షిస్తుంది. ప్రస్తుత శిఖరాగ్ర సమావేశం ఏఐ, దాని సంభావ్య చిక్కులు, ప్రపంచ ఉపాధి ల్యాండ్‌స్కేప్‌ను పునర్నిర్మించే దాని సామర్థ్యంపై చర్చించడానికి నాయకులకు ఒక ముఖ్యమైన అవకాశాన్ని కలిగించింది.

# వాణిజ్యం

## అంబానీ కిల్లర్ 2.0 దందా రెడీ!

**ముంబై, ఆగస్టు 25:** పెట్రోల్ నుంచి డిజిటల్ పేమెంట్స్ వరకు అన్ని రంగాల్లోనూ అంబానీ విస్తరణ విరామం లేకుండా కొనసాగిస్తున్నారు. తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయం ఫిన్ టెక్ రంగంలోని కంపెనీలకు నిద్ర లేకుండా చేస్తోంది. అంబానీ తన స్లో పాయిజన్ స్ట్రాటజీని మళ్లీ తెరమీదకు తీసుకొస్తున్నారు. జియో టెలికం రంగంలో సృష్టించిన ప్రభంజనాన్ని మళ్లీ రిపీట్ చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే రిలయన్స్ తన ఉద్యోగులతో కలిసి సౌండ్ బాక్స్ చెల్లింపు వ్యవస్థను పరీక్షిస్తోంది. జియో తన ఆర్థిక సేవలను విస్తరించాలని చూస్తున్నందున మిగిలిన ఫిన్ టెక్ కంపెనీల మాదిరిగానే విజయవంతమైన చెల్లింపు లావాదేవీలను ధృవీకరించే పరికరాన్ని సిద్ధం చేస్తోంది. ఇలాంటి సాంకేతికతను ముందుగా పేటిఎం సంస్థ దేశంలో పరిచయం చేసింది. రిటైల్ వ్యాపారుల వద్ద ఇది అత్యంత ప్రాచుర్యం పొంది విస్తృతంగా ఉపయోగించబడుతోంది. చెల్లించిన మొత్తాన్ని స్పీకర్ ఆడియో కన్ఫమేషన్ అందిస్తూ వ్యాపారులకు లావాదేవీల పై నమ్మకాన్ని పెంచుతుంది. పైగా సౌండ్ బాక్స్ లాభదాయకమైన సబ్‌స్క్రిప్షన్ మోడల్‌గా కూడా పనిచేస్తోంది. నామమాత్రపు ఛార్జీలతో పేటిఎం, ఫోన్ పేలు వీటిని రిటైల్ దుకాణదారులకు అందిస్తున్నాయి. పైగా ఈ డేటా ఆధారంగా వ్యాపారులకు రుణాలను కూడా ఆఫర్ చేస్తున్నాయి. దేశంలోని దిగ్గజ బ్యాంకులు హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటివి తమ సొంత స్పీకర్లను సిద్ధం చేస్తుండగా, అమెజాన్, గూగుల్ వంటి టెక్ కంపెనీలు కూడా తమ సొంత వేరియంట్లను పరీక్షించడం ప్రారంభించాయి.

## ఇపిఎఫ్‌ఒ సభ్యులకు మరింత రాబడి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** వడ్డీరేటు తగ్గిపోయిందని బాధపడుతున్న ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్‌ఒ) సభ్యులకు త్వరలో గుడ్‌న్యూస్ రానుంది. ఈక్విటీల్లో ఉపసంహరించుకున్న పెట్టుబడులను మళ్లీ ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్‌చేయాలని ఇపిఎఫ్‌ఒ భావిస్తోంది. ఇందుకు అనుమతించాలని కేంద్ర ఆర్థిక శాఖ ముందు ఇపిఎఫ్‌ఒ ఓ ప్రతిపాదన కూడా చేసిందన్నది సమాచారం. దీనివల్ల సభ్యుల భవిష్యనిధిపై మరింత రాబడికి అవకాశం కల్పించనుంది. ఇటిఎఫ్ ఉంది. దీని వల్ల తక్కువ అస్థిరతలు, మెరుగైన రాబడులకు అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఈటిఎఫ్‌లలో 2015 నుంచి ఇపిఎఫ్‌ఒ 10శాతం మేర ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది. ఇపిఎఫ్ నిర్వహణలో 12.53 లక్షల కోట్ల రూపాయలు ఉన్నాయి.



నుంచి తీసుకున్న పెట్టుబడులను మళ్లీ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఇపిఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ యేడాది మార్చిలోనే అనుమతించడం విశేషం. కేంద్ర ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇపిఎఫ్‌ఒ తన మొత్తం నిర్వహణ ఆస్తుల్లో 15శాతం వరకు పెట్టుబడులు పెట్టొచ్చు. పరిస్థితులకు అనుగుణంగా రోజువారీ ఇటిఎఫ్ పెట్టుబడులను వెనక్కి తీసుకునే ప్రతిపాదన కూడా

## ఫుట్‌వేర్ పరిశ్రమ 11% వృద్ధి!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశీయ ఫుట్‌వేర్ పరిశ్రమ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో 11 శాతం వృద్ధి సాధించగలదని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. పలు సవాళ్లు ఉన్నప్పటికీ అమ్మకాలు కూడా 4శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయని క్రిసిల్ అభిప్రాయపడింది. ముడిసరుకుల ధరలు దిగిరావడం కూడా ఈ రంగంలోని కంపెనీల నిర్వహణ మార్జిన్‌లు మెరుగుపడేందుకు సహాయ పడతాయని క్రిసిల్ పేర్కొంది. అయితే మార్జిన్‌లు కరోనా మహమ్మారి కంటే ముందు 10శాతం తక్కువగానే ఉన్నాయి. ఫుట్‌వేర్ తయారీలో ముడిసరుకుల వాటా 45శాతం ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో కీలకమైన ఇన్‌పుట్ ధరలు దాదాపు 30శాతం వరకు తగ్గడం పరిశ్రమకు కొంత కలిసి రానుంది. కాబట్టి పరిశ్రమ ఆదాయం మరీ ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అయితే ఈ రంగంలో ఎగుమతులు గణనీయంగా నెమ్మదించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.